


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**తిరంగ యాత్ర విజయవంతం చేయాలి**

- పార్టీ నేతల ఫొటోలు, బ్యానర్లు వద్దు
- కేవలం జాతీయ పతాకం మాత్రమే కనిపించాలి
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా పిలుపు

7

# పారిశ్రామిక పరుగులు



కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి

3

సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం

19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేలమందికి ఉద్యోగావకాశాలు

6 ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఓకే

వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ పర్యవేక్షణ



## స్వచ్ఛ పల్లెలతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

- డ్వాక్రా మహిళలకు గ్రామాల్లో 'తడి చెత్త' నిర్వహణ బాధ్యత
- ఏజెన్సీలు 'పొడి చెత్త'ను సేకరించేలా త్వరలో టెండర్లు
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం
- 'సర్క్యులర్ ఎకానమీ పాలసీ' రూపొందించాలని నిర్దేశం

2

## కాటన్ సేవలు మరువలేం

- జయంతి సందర్భంగా సీఎం నివాళి

2

## ఏడాది పాలనలో.. చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- కూటమి మధ్య చిచ్చుకు వైసీపీ చేసే కుట్రలను తిప్పికొట్టండి
- రెడ్ బుక్ మరువను... కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదలను
- సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా... పనిచేసే వారిని గుర్తిస్తా
- మన పెద్దపండుగ మహానాడును విజయవంతం చేయండి
- గుంతకల్లు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్

4



## మీ సాయం వల్లే చదువు కొనసాగిస్తున్నాం

- యువనేత లోకేష్‌కు విద్యార్థినుల కృతజ్ఞతలు
- చదువు పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకుంటానన్న లోకేష్
- దివంగత ఉత్తమ కార్యకర్త కుటుంబసభ్యులను సత్కరించిన యువనేత

7

## అధికారంలోకి వచ్చామని అలసత్వం వద్దు

- ఐదేళ్లు నరకం అనుభవించాం.. పడిన అవమానాలు మర్చిపోకూడదు
- చర్చించుకుని మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం
- పరిశ్రమల ఏర్పాటుద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- డీఎస్సీ ఆపేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లిన వైసీపీ
- గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్

5





## అన్ని విధాల అండగా ఉంటా

- వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ భరోసా
- అమ్మనబ్రోలులోని నివాసానికి వెళ్లి పరామర్శ
- వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి

6

## జగన్ దోపిడీని చంద్రబాబుకు అంటగట్టి రాసిన అబద్ధమే వందసార్లు రాస్తున్న సాక్షి

2

# స్వచ్ఛ పల్లెలతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

- డ్వాక్రా మహిళలకు గ్రామాల్లో 'తడి చెత్త' నిర్వహణ బాధ్యత
- ఏజెన్సీలు 'పొడి చెత్త'ను సేకరించేలా త్వరలో టెండర్లు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- 'సర్క్యులర్ ఎకానమీ పాలసీ' రూపొందించాలని నిర్దేశం




అమరావతి (చైతన్య రథం): వ్యర్థాల సమర్ధ నిర్వహణతో రాష్ట్రంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛంగా మలిచేలా కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రతీరోజూ ఇళ్లనుంచి చెత్తను సేకరించి తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చేలా, పొడి చెత్తను ఏజెన్సీలకు అప్పగించేలా చూడాలన్నారు.

ఇందుకు సంబంధించి ఏజెన్సీలను ఆహ్వానించేందుకు వచ్చే నెలలో టెండర్లు పిలవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే తడి చెత్తను ఎక్కడికక్కడ ఎరువుగా మార్చేలా డ్వాక్రా మహిళలకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ప్రతి మండల హెడ్ క్వార్టర్‌లోనూ, అలాగే జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలో మొత్తం 52 క్లస్టర్లు ఏర్పాటు చేసి... చెత్తను గ్రేడింగ్ చేసి దానిని కావాల్సిన ఏజెన్సీలకు విక్రయించడమో, లేదా అక్కడనుంచి చెత్తను తరలించడమో చేయాలన్నారు. ఏ పంచాయతీలోనూ చెత్తను తీసుకువచ్చి రోడ్డుపై వేయడానికి వీల్లేదన్నారు.

సర్క్యులర్ ఎకానమీపై గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి వ్యర్థాల నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించిన పంచాయతీలకు, వ్యక్తులకు అక్టోబర్ 2న అవార్డులు అందించాలని సూచించారు. 2026 అక్టోబర్ 2కల్లా మొత్తం వ్యవస్థ గాడిలో పడాలన్నారు.

## 'జీరో వేస్ట్' ప్రభుత్వ విధానం

'జీరో వేస్ట్ అనేది మన లక్ష్యంగా ఉండాలి. ప్రతి పంచాయతీలో అమలయ్యేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయండి. స్వచ్ఛాంధ్రప్రదేశ్, కాలుష్య నియంత్రణ మండలితో కలిసి పంచాయతీరాజ్ శాఖ సమన్వయం చేసుకోవాలి. ఎలక్ట్రిక్ వెహికల్స్ ఏర్పాటు చేసి చెత్తను కలెక్ట్ చేసే అంశాన్ని పరిశీలించాలి. వ్యవసాయ వ్యర్థాలతోపాటు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వచ్చే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి దోహదం చేసేలా అధ్యయనం జరగాలి. 'సర్క్యులర్ ఎకానమీ పాలసీ' రూపొందించాలి. సర్క్యులర్ ఎకానమీలో ముందున్న రాజస్థాన్ మోడల్‌ను పరిశీలించాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు నెల్లూరు, రాజమండ్రి, కడప, కర్నూలులో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల పురోగతిని సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.



## కాటన్ సేవలు మరువలేం

### జయంతి సందర్భంగా సీఎం నివాళి

అమరావతి (చైతన్య రథం): సాగునీటి జలాలు అందించి స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి కృషి చేసిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు నిర్మించి స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేరు. ఒక వ్యక్తి తలుచుకుంటే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో కాటన్ మహాశయుడు రుజువు చేశారు. కాటన్ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని స్మృతికి నివాళి అర్పిస్తున్నా' అని పేర్కొన్నారు.

## జగన్ దోపిడీని చంద్రబాబుకు అంటగట్టి రాసిన అబద్ధమే వందసార్లు రాస్తున్న సాక్షి

| సాక్షి కుతర్కపు రాతలు | నిగ్గు తేలిన నిజాలు |
|---|---|
| 1. వైసీపీ పాలనలో మద్యం అమ్మకాలు పడిపోయాయి. మరి విక్రయాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? | 1. విక్రయాలు తగ్గాయనేది పచ్చి అబద్ధం. ఒక లారీ మద్యం విక్రయాలు అధికార లెక్కల్లో చూపి రెండు లారీల మద్యం దొంగచాటుగా అమ్మారు. అందుకే నగదులో అమ్మకాలు చేశారు. డిజిటల్ పేమెంట్స్ అనుమతించలేదు. అధికార లెక్కల్లో సిట్ రూ.3,200 కోట్ల కమిషన్‌కు ఆధారాలు సేకరించింది. అనధికార అమ్మకాల లెక్కలోకి సిట్ వెళితే మద్యం కుంభకోణం మరింత భారీగా పెరుగుతుంది. |
| 2. విక్రయ వేళలు కుదిస్తే లంచాలు ఇస్తారా? | 2. అధికార విక్రయ వేళలు కుదించింది, దొంగచాటు మద్యం అమ్మకాలు చేసి వేల కోట్ల నగదు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించింది నిజం. |
| 3. మద్యం దుకాణాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? | 3. చూపుడుకు అధికార షాపులు తగ్గించారు. నిజానికి దొంగచాటుగా మొబైల్ షాపులు, బెల్టు షాపులు మొత్తం 4 లక్షలు.. 24 గంటలూ పనిచేశాయి. వీటి ద్వారా వచ్చిన సొమ్ము తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది. |
| 4. ఎంపిక చేసుకున్న 4-5 డిస్టలరీలకు మాత్రమే ఆర్డర్లలో 53 శాతం వరకు ఇస్తే లంచాలు ఇస్తారా? | 4. 4-5 డిస్టలరీల్లో తయారైన నాసిరకం మద్యానికి ఆర్డర్లు ఇచ్చారు కాబట్టి వారు కేసుకు రూ.150 నుండి రూ.600 లంచం ఇచ్చినట్లు ఆధారాలు లభ్యమయ్యింది నిజం. లంచాలు ఇవ్వని ఇంటర్నేషనల్ బ్రాండ్లను తరిమేసింది నిజం. |
| 5. ఇప్పుడున్న డిస్టలరీలలో అధిక శాతం అనుమతులు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్నవారికి లంచాలు వస్తాయా? | 5. చంద్రబాబు పాలనలో నాసిరకం మద్యానికి అనుమతించలేదు. నాణ్యమైన ఇంటర్నేషనల్ బ్రాండ్లు చంద్రబాబు పాలనలో ఉండేవి. వీరు లంచాలు ఇవ్వలేమన్నందున జగన్ ప్రభుత్వం వారికి ఆర్డర్లు ఇవ్వలేదు. అందుచేత నాసిరకం మద్యం తాగి 35 లక్షల మంది రోగగ్రస్తులయ్యారు. 30 వేలమంది మరణించడం వల్ల వారి మాంగల్యాలు మంటకలిశాయి. జగన్ ధనపిచ్చికి ఆరోగ్య విపత్తు ఏర్పడింది నిజం. |
| 6. ఏ ఒక్క డిస్టలరీకి అనుమతి ఇవ్వని వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఉన్న వారికి లంచాలు ఇస్తారా? | 6. రాష్ట్రంలో ఉన్న డిస్టలరీల యజమానుల్ని బెదిరించి వాటన్నింటిని జగన్ ముఠా స్వాధీనం చేసుకొని నాసిరకం మద్యం తయారు చేసి అమ్మింది నిజం. ఇది ప్రజలందరికీ తెలిసిన సత్యమైనా కుతర్కంతో ప్రజల్ని ఏమార్చే ప్రయత్నం చేస్తున్న సాక్షి మీడియా కూడ అవినీతి పుత్రికే. |
| 7. టీడీపీ గత ప్రభుత్వంలో, ప్రస్తుతం కూడ మద్యం అమ్మకాలు ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోనే ఉన్నవి. అవికూడ టీడీపీ వారికి సంబంధించినవే. | 7. మద్యం షాపులన్నీ టీడీపీ వారివే అనే సాక్షి ఆరోపణ అబద్ధం. ఉదాహరణకు తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 57 మద్యం దుకాణాలు ఉండగా అందులో వైసీపీ వారివే 49 షాపులు ఉన్నాయి. లాటరీ ద్వారా షాపులు పారదర్శకంగా కేటాయించడమైంది.<br>జగన్ పాలనలో షాపులన్నీ వారి కంట్రోల్‌లోనే ఉన్నాయి. అందువల్లనే అక్రమ మద్యం వ్యాపారం చేయగలిగారు. |

చైతన్యరథం



సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపీబీ సమావేశానికి హాజరైన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె విజయానంద్ తదితర ఉన్నతాధికారులు

# పారిశ్రామిక పరుగులు

- కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి
- సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం
- 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేల మందికి ఉద్యోగావకాశాలు
- 6 ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఓకే
- వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ పర్యవేక్షణ


అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెనువెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించగా... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామికవేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6సార్లు సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. తాజాగా గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపీబీ సమావేశంలో 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్లకుపైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపీబీ సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## 50 వేల హోటల్ రూములు లక్ష్యం

టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హోటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హోటల్



రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చేవారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతారవణంలో ఉండాలి అనుకుంటారు.
రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదేవిధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామికరంగంపై మాట్లాడుతూ... 'వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి' అని సీఎం సూచించారు.

## 6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు

6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ.33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటిద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

### ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్

1) దెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, కుమరవరం, అనకాపల్లి జిల్లా: రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు
2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా: రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు
3) పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, ఓర్వకల్, కర్నూలు జిల్లా: రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు
4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్, రాంబిల్లి, అనకాపల్లి జిల్లా: రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు
5) జూపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాంబిల్లి, అనకాపల్లి జిల్లా: రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

### టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్

6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా: రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు
7) మోహన్ స్పింటెక్స్, మాలవల్లి, కృష్ణా జిల్లా: రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు
8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్, అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా: రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు

### ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్

9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి జిల్లా: రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు
10) అలీప్ కుప్పం, చిత్తూరు జిల్లా: రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు

### ఎనర్జీ డిపార్ట్‌మెంట్

11) నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏలూరు జిల్లా: రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు
12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు: రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు
13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కడప జిల్లా: రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు
14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు: రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు

### టూరిజం డిపార్ట్‌మెంట్

15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి, తిరుపతి: రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు
16) స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి: రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు
17) వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం: రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు

### ఐటీ డిపార్ట్‌మెంట్

18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీ, తిరుపతి జిల్లా: రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు
19) సెన్స్‌రెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కర్నూలు జిల్లా: రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు

# ఏడాది పాలనలో..
# చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కూటమి మధ్య చిచ్చుకు వైసీపీ చేసే కుట్రలను తిప్పికొట్టండి
- రెడ్ బుక్ మరువను... కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదలను
- సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా... పనిచేసే వారిని గుర్తిస్తా
- మన పెద్దపండుగ మహానాడును విజయవంతం చేయండి
- గుంతకల్లు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్



గుంతకల్లు (చైతన్యరథం): ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేసింది చెప్పుకోవాలి.. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా రూ. 4వేల పెన్షన్ ఇవ్వడం లేదు.. అవ్వతాతలకు అండగా నిలిచేందుకే పెన్షన్ పెంచాం.. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం.. వాటిగురించి పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో గురువారం జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ మాట్లాడుతూ....అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసితో పనిచేయాలన్నారు. బాబు సూపర్ -6, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో పార్టీ తరపున పలు హామీలుఇచ్చాం.ఒక్కొక్కటిగా వాటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 11నెలల ప్రజా ప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ రూ. 4వేలకు, వికలాంగ పెన్షన్ రూ. 6వేలకు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా పేదల ఆకలితీర్చే అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. ఉచిత గ్యాస్ పథ కాన్ని అమలు చేస్తున్నాం. ఈ పథకంలో నిబంధనలు సడలించి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు చేయాలని నిర్ణయించాం. మత్స్యకారులకు ఆర్థికసాయం అందించాం, చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నాం. జూన్ మాసంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇస్తాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళ్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

### వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

మన ప్రభుత్వం స్కూళ్లు మూసివేస్తోందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఒక్క పాఠశాలను కూడా మూయడం లేదు. అది మన లక్ష్యం కాదు. ఒక క్లాస్‌కు ఒక టీచర్ ఉండాలన్నదే మన ధ్యేయం. మన ప్రభుత్వం వచ్చేనాటికి కేవలం 1200 స్కూళ్లలో క్లాసుకో టీచర్ ఉంటే,ఇప్పుడు 9800మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి.గతంలో ప్రభుత్వ స్కూళ్లలో 45లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 33లక్షలకు పడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం. మంత్రి నారాయణ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మన ప్రభుత్వం వచ్చి జూన్ మాసానికి సంవత్సరం అవుతుంది. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా అన్నీచేస్తాం. బీజేపీ, జనసేన పార్టీతో కలిసి పొత్తుతో పోటీచేశాం.నామినేటెడ్ పదవుల విషయంలో వారితో మాట్లాడి పదవులు ఇస్తున్నాం. కొందరు వైసీపీ వాళ్లు అపోహలు సృష్టిస్తున్నారు, వక్ఫ్ బిల్లులో సవరణలు ప్రతిపాదించి ముస్లిం సోదరులకు అండగా నిలిచాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత టీడీపీ చూసుకుంటుంది. జనసేనతో కలిసి పోటీ చేశాం, భవిష్యత్తులో కలిసే ప్రయాణం చేస్తాం, మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు. ఈరోజు మనం తలెత్తుకుని తిరగడానికి కేంద్ర సహకారం కారణం. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ తప్ప అన్ని ప్రైవేటీకరిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాయం చేస్తున్నారు.వైసీపీ వాళ్లు చిచ్చుపెట్టాలని చూస్తారు, సమర్ధ వంతంగా తిప్పికొట్టాలని మంత్రి లోకేష్ సూచించారు.

### 5ఏళ్లలో చేయలేనిది 11నెలల్లో చేశాం

యువగళం పాదయాత్ర చేసినపుడు కార్యకర్తల అభీష్టం మేరకు కష్టపడిన కార్యకర్తలనుగుర్తించడానికి మీ ముందుకు వస్తున్నా. కార్యకర్తల పనితీరును టెక్నాలజీకి అనుసంధానం చేస్తే ఎవరు పనిచేస్తారో తెలుస్తుందని నేను ఆనాడే చెప్పా.దీనివల్ల ఎవరు పనిచేస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చే ముందు క్లస్టర్, గ్రామ, మండల నేతలను కలుస్తానని చెప్పిన మేరకు శుక్రవారం మెగా సోలార్ పార్కు శంకుస్థాపనకు వచ్చే ముందు ఇక్కడకు వచ్చా. అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేనిది 11నెలలో చేసి చూపించాం. కరెంటు చార్జీలు పెంచ బోమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. అనంతపురానికి రూ. 22వేల కోట్ల విలువైన భారీసోలార్ విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. రాబోయే అయిదేళ్లలో మనపిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. పార్టీ కార్యకర్తలంతా ప్రభుత్వపరంగా చేపట్టే అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

### అందరి కష్టంతో చరిత్రను తిరగరాశాం

పార్టీ ఆవిర్భావం తర్వాత ఎప్పుడూ లేనివిధంగా ప్రజలు కూటమికి 94శాతం సీట్లు ఇచ్చారు. సునామీ మాదిరి ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశాం, దీనివెనుక కార్యకర్తల కష్టం,త్యాగాలు ఉన్నాయి.నాలుగున్నర దశాబ్దాల్లో అధికారం, ప్రతిపక్షం రెండూ చూశాం. అయితే గత అయిదేళ్లలాంటి అరాచకపాలన ఇదివరకెన్నడూ చూడలేదు.గతంలో చంద్రబాబు పర్యటనకు వెళ్తే ఎవరూ ఆపేసాహసం చేయలేదు. 2019 నుంచి 24వరకు భయానక పరిస్థితులు కల్పించారు. చంద్రబాబు బయటకు వస్తుంటే ఇంటి గేట్లకు తాళ్లు కట్టేశారు. స్థానికసంస్థల ఎన్నికలు జరిగితే బి.ఫారాలు పట్టుకెళ్లారు, ఇళ్లు ధ్వంసం చేశారు. పుంగనూరులో అంజిరెడ్డి తాత మీసాలు మెలేసి తొడగొట్టి నామినేషన్ వేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. పల్నాడులో మంజులా రెడ్డి అనే తెలుగు మహిళ బూత్ ఏజంటుగా ఉన్నందుకు కత్తులతో దాడిచేసినా పోలింగ్ అయ్యి ఓటింగ్ మిషన్ సీల్‌వేసేవరకు అక్కడే ఉన్నారు. పల్నాడులో చంద్రయ్య మెడపై కత్తి పెట్టి జై జగన్ అనమంటే జై చంద్రబాబు అన్నందుకు మెడకోసి హత్యచేశారు, అయిదేళ్ల రాక్షస పాలనలో అనేక కష్టాలు మనం ఎదుర్కొన్నామని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

### సభ్యత్వంలో సత్తా చాటాం

తెలుగుదేశం పార్టీ రెండేళ్లకోసారి చేపట్టే సభ్యత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చేసి చూపించారు. భారత్ లో ఏ ప్రాంతీయ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు టీడీపీకే సొంతం. దానికి కార్యకర్తల కష్టమే కారణం. కార్యకర్తల బీమాను రూ.5 లక్షలకు పెంచాం, పేదపిల్లలకు నిరంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుంతకల్లులో గుమ్మనూరు జయరాంను ఎన్నికలకు నెలముందు చంద్రబాబు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు, అయినప్పటికీ భుజాలపై మోసి గెలిపించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు తెలుసుకోవాల్సిందిగా ఎమ్మెల్యేని కోరుతున్నా. వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకోవాలి. పార్టీలో పాత, కొత్తల కలయిక జరగాలి. పనిచేసినవారికి పెద్దపీట వేయాలి. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా, పనిచేసేవారిని ప్రోత్సహిస్తా. కార్యకర్తలు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలి. మనందరిదీ ఒకటే వర్గం, అది తెలుగుదేశం. గత 35 ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిలో 2019లో పోటీచేసి నేను ఓడిపోయా. మొదటిరోజు బాధపడినా రెండోరోజు నుంచి కసిపెరిగింది. కష్టపడి పనిచేసి అక్కడ చరిత్ర తిరగరాశాం. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచాం, మంగళగిరిలో ఇప్పుడు ఎటువంటి గ్రూపులు లేవని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### కేడర్‌ను ఇబ్బందులు పెట్టినవారిని వదలను

పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారిని వదలను. నా అంతట నేనుగా ఎవరితో గొడవపెట్టుకోను, మన జోలికి వస్తే మాత్రం వదలను. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రమంతా చూస్తున్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈక్రమంలో కొంచెం సమయం పట్టొచ్చు. కార్యకర్తలు అహంకారం లేకుండా ప్రజల్లోకి వెళ్లి వారిచుట్టూ తిరగాలి. పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందే. కార్యకర్తల కోసం జగన్‌పై కంటే మూడురెట్లు ఎక్కువగా పార్టీలో పోరాడుతున్నా. ఇది మన కుటుంబం, మన పార్టీ. అన్యాయం జరిగితే నన్ను, ఇతరపార్టీ పెద్దలను కలవాలి. ఇన్‌చార్జి మంత్రి నెలకు ఒకసారి రావాలని ఇప్పటికే చెప్పా. జోనల్ కోఆర్డినేటర్, పార్లమెంటు అధ్యక్షుడు ఉన్నారు. సమస్యపై నాలుగు గోడల మధ్య యుద్ధం చేద్దాం, బయటకు వచ్చాక జై తెలుగుదేశం అని నినదిద్దామని మంత్రి లోకేష్ అన్నారు.

### త్వరలో మై టీడీపీ పేరుతో కొత్త యాప్

పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కేడర్‌కు చేరవేసేందుకు మహానాడు తర్వాత మై టీడీపీ పేరుతో కొత్త యాప్ విడుదల చేస్తాం. కెఎస్ఎస్, బూత్,క్లస్టర్, అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తాం. ఈనెల 18,19,20 నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు జరుగుతుంది. 27,28, 29 కడపలో మన పెద్దపండుగ మహానాడు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జోన్-5 కోఆర్డినేటర్ కోవెలమూడి నాని, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.









# అధికారంలోకి వచ్చామని అలసత్వం వద్దు

- ఐదేళ్లు నరకం అనుభవించాం.. పడిన అవమానాలు మర్చిపోకూడదు
- చర్చించుకుని మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం
- పరిశ్రమల ఏర్పాటుద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- డీఎస్సీ ఆపేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లిన వైసీపీ
- గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్





గుంతకల్లు (చైతన్యరథం): అధికారంలోకి వచ్చామని అలసత్వం వద్దని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేద్దామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని రామరాజుపల్లెలో గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో గురువారం మంత్రి లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని హామీ ఇచ్చానని, మాట నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చానన్నారు. 2019 ఎన్నికల్లో మనం ఓటమి పాలయ్యాం. ఆనాడు అసెంబ్లీలో అమరావతి అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ వైసీపీ దాష్టీకాలకు ఎదురొడ్డి నిలిచారు. అందుకే పార్టీ వారి రుణం తీర్చుకుందని మంత్రి లోకేష్ తెలిపారు.

## మనం పడిన అవమానాలు మర్చిపోకూడదు

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94 శాతం సీట్లతో విజయం సాధించాం. గెలిచినప్పుడుఅందరూ చప్పట్లు కొడతారు. 2019-24 మధ్య మనం పడిన అవమానాలు మర్చిపోకూడదు.ఏతప్పూ చేయని చంద్రబాబుని 53 రోజులపాటు జైల్లో అక్రమంగా నిర్బంధించారు. ఎన్నికల్లో ఎదురొడ్డి నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, పల్నాడులో తోట చంద్రయ్యలే మనకు స్ఫూర్తి. కార్యకర్తలు, నాయకులపై అనేక అక్రమకేసులు పెట్టారు. యువగళంలో నన్ను అనేక విధాలుగా అవమానించారు. మన రక్తంలోనే పసుపు ఉంది. అడుగడుగునా పోరాడి విజయం సాధించాం. ఈ జిల్లాలో యువగళాన్ని ప్రభంజనంలా మార్చారని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి

జగన్ రెడ్డి వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి ఐదేళ్ల సమయం పట్టింది. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలు అందిస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేశాం. కోటి మందికి దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు అందజేశాం. ఇప్పుడు నాలుగు నెలలకు ఒకసారి రూ.800 నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో జమచేస్తాం. జూన్ మాసంలో తల్లికి వందనం కార్యక్రమం అమలుచేస్తాం. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

## డీఎస్సీ ఆపేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు

మెగా డీఎస్సీ ద్వారా 16,247 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నాం. జూన్ మాసం నుంచి పరీక్షలు జరగనున్నాయి. డీఎస్సీ ఆపేందుకు వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. సమయం పెంచాలంటున్నారు. గతేడాది డిసెంబర్ లోనే సిలబస్‌ను ప్రకటించాం. జగన్ రెడ్డికి అసలు సిలబస్ అంటే ఏంటో తెలియదు. స్థానికులకే పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రూ.22 వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకుందాం

టీడీపీకి కార్యకర్తలే బలం. అధికారంలోకి వచ్చామని అహంకారం వద్దు. ఓర్పు, సహనంతో ప్రజలకు సమాధానం చెబుదాం. కార్యకర్తలు.. ప్రజల చుట్టూ తిరిగితే మేం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాం. నేతలు అలకలు వీడాలి. పార్టీలో సంస్కరణల కోసం పోరాడుతున్నా. చర్చించుకుని మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం. ఐదేళ్లు నరకం అనుభవించాం. అది మర్చిపోకూడదు. అడుగడుగునా అవమానించారు. అక్రమ కేసులు పెట్టారు. పనిచేసే వారిని ప్రోత్సహిస్తాం. మహానాడు నాటికి కమిటీలను పూర్తిచేయాలి. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పుట్టిపెరిగింది టీడీపీలోనేనని, ఓర్పు, సహనంతో సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. 2014-19 మధ్య పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు.

## టైం మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబుతో పోటీపడుతున్నారు: మంత్రి పయ్యావుల

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేందుకు కూడా కష్టపడాల్సిన పరిస్థితి ఉండిందన్నారు. కేంద్రం, సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో ప్రభుత్వాన్ని నడుపుకోగలగు తున్నాం. సీఎం చంద్రబాబును చూసి పరిశ్రమలు వస్తున్నాయి. ఎన్నడూలేని విధంగా రూ.3,800 కోట్లతో హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు చేపట్టి పూర్తిచేస్తున్నాం. రాయలసీమ అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అనంతలో రూ.22 వేల కోట్లతో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ రాబోతోంది. మంత్రి



నారా లోకేష్ విద్యాశాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారు. టైం మేనేజ్‌మెంట్‌లో సీఎం చంద్రబాబుతో పోటీపడుతున్నారు. పనితీరు చాలా స్ట్రెయిట్‌గా ఉంటుంది. నాయకుల కంటే కార్యకర్తలకే ఎక్కువ సమయం ఇస్తున్నారు. మరో 30 ఏళ్ల పాటు బలమైన నాయకత్వాన్ని తయారుచేసే పనిలో ఉన్నారని, ఇందుకు లోకేష్‌కి మద్దతుగా నిలబడదామని మంత్రి పయ్యావుల పిలుపు ఇచ్చారు.

## పౌరుషాగ్ని రగిలించిన లోకేష్: ఎమ్మెల్యే జయరాం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. యువగళం ద్వారా నారా లోకేష్ యువతలో పౌరుషాగ్ని రగిలించారన్నారు. దేశంలో కోటిమంది



సభ్యత్వం ఉన్న ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీ. చాలా మంది నన్ను అదృష్ట వంతుడని అంటున్నారు. నాకు అదృష్టం కల్పించిన నాయకుడు చంద్రబాబు నాయుడు. రాబోయే రోజుల్లో కలిసికట్టుగా పనిచేసి టీడీపీ జెండాను రెపరెపలాడిద్దా మన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జోనల్ కో ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, గుంతకల్లు నియోజకవర్గ పరిశీలకుడు తిమ్మయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# అన్ని విధాల అండగా ఉంటా





- వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ భరోసా
- అమ్మనబ్రోలులోని నివాసానికి వెళ్లి పరామర్శ
- వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి

ఒంగోలు (చైతన్యరథం): ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. గురువారం ఉదయం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్.. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహ రెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి

**అమ్మనబ్రోలులో మంత్రి లోకేష్‌ను కలిసిన పొగాకు రైతులు**

అమ్మనబ్రోలు (చైతన్యరథం): పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పలువురు రైతులు మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో గురువారం వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన లోకేష్‌ను పొగాకు రైతులు కలుసుకొని తమ సమస్యను తెలియజేశారు. వెంటనే మంత్రి లోకేష్ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి ఫోన్ చేసి పొగాకు రైతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై అవసరమైతే కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడాల్సిందిగా సూచించారు. దీనికి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ధర పెంపు విషయమై ఇప్పటికే పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు, బోర్డు అధికారులతో మాట్లాడుతున్నానని చెప్పారు. 20 కి.మీ. లోపు రవాణా చార్జీలను చెల్లించేందుకు కూడా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చూడాలని మంత్రి లోకేష్ కోరారు.









# మీ సాయం వల్లే చదువు కొనసాగిస్తున్నాం

- యువనేత లోకేష్‌కు విద్యార్థినుల కృతజ్ఞతలు
- చదువు పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకుంటానన్న లోకేష్
- దివంగత ఉత్తమ కార్యకర్త కుటుంబసభ్యులను సత్కరించిన యువనేత



గుంతకల్లు (చైతన్యరథం): కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను అన్నలా ఆదుకున్న యువనేత నారా లోకేష్ లోకేష్ చేసిన సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటామని అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. గుంతకల్లు నియోజకవర్గం శంకరబండకు చెందిన బోనాసి ప్రభాకర్ రెండో విడత కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆయన భార్య, కుమార్తెలకు ఏంచేయాలో పాలుపోలేదు. అప్పటికి పెద్ద కుమార్తె పురంధేశ్వరి బీటెక్ ఫస్టియర్ చదువుతుండగా, మరో కుమార్తె స్నేహలత ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసింది. నంద్యాలలో యువగళం పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో ప్రభాకర్ భార్య, కుమార్తెలు యువనేత లోకేష్‌ను కలిసి తమ కష్టాలు చెప్పుకున్నారు. దీంతో చలించిన లోకేష్ ఆ ఇద్దరు బిడ్డలను తాను చదివిస్తానని మాట ఇచ్చారు.

ఇచ్చిన మాట ప్రకారం పెద్దకుమార్తె పురంధేశ్వరికి ఫీజు తానే చెల్లిస్తూ చదివిస్తున్నారు. చిన్న కుమార్తె స్నేహలతను హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ కళాశాలలో డిగ్రీ చదివిస్తున్నారు. ప్రభాకర్ భార్య, కుమార్తెలు గురువారం గుత్తిలో మంత్రి లోకేష్‌ను కలిసి తమ కుటుంబాన్ని కష్టకాలంలో ఆదుకున్నారంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఆ ఇద్దరు విద్యార్థినుల చదువు పూర్తయ్యే వరకు తాను అండగా ఉంటానని యువనేత లోకేష్ భరోసా ఇచ్చారు.

ఇదిలావుండగా పామిడికి చెందిన ఉత్తమ కార్యకర్త, యూనిట్ ఇన్చార్జి పీవీ శివకుమార్ యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయారు. గుత్తిలో ఉత్తమ కార్యకర్తల సమావేశం సందర్భంగా ఆయన భార్య, కుమారుడిని పిలిపించి మంత్రి లోకేష్ ప్రత్యేకంగా సత్కరించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# అడుగడుగునా జేజేలు..

## మంత్రి లోకేష్‌కు అపూర్వ స్వాగతం








అమరావతి (చైతన్యరథం): అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలో గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ నేతలు, కార్య కర్తలు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత బేత పల్లికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు టీడీపీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, పార్టీ శ్రేణుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. బేతపల్లి నుంచి గుంతకల్లు నియోజకవర్గం రామరాజుపల్లెకు బయలుదేరిన మంత్రి లోకేష్‌కు అడుగడుగునా పార్టీశ్రేణులు, స్థానిక ప్రజానీకం జేజేలు పలికారు. మూడు రోజుల పాటు అనంతపురం జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటించను న్నారు. గురువారం సాయంత్రం రామరాజుపల్లెలో టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో, అనంతరం గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయం సమావేశంలో పాల్గొంటారు. శుక్రవారం బేతపల్లిలో రెన్యు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అనంతపురంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర బాబు కుమార్తె వివాహానికి హాజరవుతారు. 17వ తేదీన అనంతపురం జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి మంత్రి నారా లోకేష్ హాజరవుతారు.





# తిరంగ యాత్ర విజయవంతం చేయాలి

- పార్టీ నేతల ఫొటోలు, బ్యానర్లు వద్దు
- కేవలం జాతీయ పతాకం మాత్రమే కనిపించాలి
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా పిలుపు

అమరావతి (చైతన్యరథం): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని, భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచే రాజకీయేతర ఉద్యమంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న తిరంగ యాత్రను ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, జిల్లాల అధ్యక్షులు, విభాగ ఇన్‌ఛార్జులు, యువత, మహిళా నేతలు, పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ నిర్వహించి యాత్రకు సంబంధించి కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. ఈ యాత్ర పూర్తిగా రాజకీయేతరమైన దని పల్లా స్పష్టం చేశారు. ఎలాంటి పార్టీ చిహ్నాలు, నాయకుల ఫొటోలు, బ్యానర్లు, బ్రాండింగ్ లేకుండా కేవలం జాతీయ పతాకంతోనే యాత్ర నిర్వహించా లన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల పట్ల గౌరవాన్ని వ్యక్తపరిచే విధంగా ఈ కార్యక్రమం కొనసాగాన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతో..

ప్రతి నియోజకవర్గం, మండల స్థాయిలో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో యాత్రను సమ్మిళితంగా, శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని పల్లా పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ఇందులో పూర్తిగా భాగస్వామిగా ఉండాలని అన్నారు. భారత సైనికుల సేవలను గౌరవించేందుకు ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో చురుకుగా పాల్గొని దేశభక్తిని చాటాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.




TELUGU DESAM PARTY
తెలుగుదేశం పార్టీ




తెలుగుదేశం


తెలుగుదేశం పార్టీ
DESAM PARTY


తెలుగుదేశం
TELUGU DESAM


TELUGU DESAM PARTY
తెలుగుదేశం పార్టీ


తెలుగుదేశం పార్టీ
TELUGU DESAM PARTY


TELUGU DESAM PARTY


DESAM PARTY
తెలుగుదేశం పార్టీ


TELUGU DESAM PARTY
తెలుగుదేశం


DESAM PARTY


TELUGU DESAM PARTY
తెలుగుదేశం పార్టీ


TELUGU DESAM PARTY
తెలుగుదేశం పార్టీ

# వేటాడాల్సింది తిమింగలాన్ని!?

గత జన్మ పాపాలు ఏదోక రూపంలో ఈ జన్మను పీడిస్తాయంటారు పెద్దలు. అందులో అంతరార్థం ఏమైనా, పూర్వం పదవిలో ఉన్నప్పుడు చేసిన పాతకాలు తాము అధికారం కోల్పోయిన తరవాత నిద్ర పట్టకుండా చేస్తాయన్నది తాజా రాజకీయ వాస్తవం. నిజం నిలకడమీద బయట పడుతుందంటారు. యావత్ దేశం బిత్తరపోయేలా జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం లోతుల్లోకి వెళ్తుంటే విచారణ అధికారులకే కళ్లు బైర్లు గమ్ముతున్నాయి. 2019లో మద్య నిషేధమంటూ రాష్ట్ర ప్రజల కళ్ళకు గంతలుకట్టి దోపిడీకి మద్యాన్ని మార్గంగా ఎన్నుకొని చేసిన సాగించిన దందా యావత్తు జాతిముందు పుటలు పుటలుగా ఆవిష్కృతమవుతుంది. జగన్ ప్రభుత్వహయంలో జరిగిన మద్యం విక్రయాల్లో మాయమైన మొత్తంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సిఐడి విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశించించింది. కూటమి నేతలు చెబుతున్న లెక్కల ప్రకారం రాష్ట్రంలో 30వేల కోట్ల రూపాయల నిధులు దారి మళ్లినట్లు సమాచారం. దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలూ ఉన్నట్టు చెబుతున్నారు. మరోవైపు అధికారులు ఇచ్చిన నివేదిక లోనూ భారీ కుంభకోణం జరిగినట్టు చెబుతున్నారు. దశలవారీగా మద్య నిషేధమంటూ ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం ఏదశలోనూ అమలు చేయలేదు. అధికారుల నివేదిక ప్రకారం 2019–24 మధ్య రాష్ట్రంలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. కానీ ఆస్థాయిలో నిధులు రాష్ట్ర ఖజానాకు చేరలేదు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో రూ.99 వేల కోట్ల మద్యం తయారీ, అమ్మకాలు జరగ్గా కేవలం రూ.18,860 కోట్ల ఆదాయం మాత్రమే చూపారని శాసనసభలో సీఎం చంద్రబాబు చెప్పారు. అంతకన్నా ఎక్కువే ఉంటుందని దాదాపు రూ.30 వేల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు టీడీపీ సభ్యులు. ఈ మొత్తం దోపిడి పూర్వాపరాలను నిగ్గుతేల్చడానికి సిట్‌తో దర్యాప్తు చేయిస్తున్నది కూటమి ప్రభుత్వం. జగన్ ముఠా మద్యం దందాలను వెలికితీయడంతోపాటు నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తయ్యేలా చూడటం అత్యావశ్యకం. అతిపెద్ద మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులయిన చిన్న చేపలను కటకటాల్లోకి పంపడం కాదు అంతిమంగా లబ్ధిపొందిన అతిపెద్ద తిమింగలాన్ని అరెస్టు చెయ్యడం, తిమింగలం మింగిన ప్రతి పైసాను కక్కించడమూ ప్రభుత్వ బాధ్యతే. అలా రాబట్టిన సొమ్మును జే బ్రాండ్లతో ఛిద్రమైన జనారోగ్యాన్ని బాగుచేసేందుకు వినియోగించాలి. నకిలీ మద్యం ముఠా స్వాహాపర్వాలను బట్టబయలు చేసి, వారికి తగిన శిక్షలు పడేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అధికారాన్ని అవినీతి గనిగా మార్చి నకిలీ మద్యం ద్వారా అక్రమార్గంలో జగన్ ముఠా దురాశకు అవినీతికి యావత్ ఆంధ్రప్రదేశ్ బలైంది. నకిలీ మద్యం మహమ్మారిని రాష్ట్రంమీదకు వదిలి ప్రజల సొమ్మును ఆయురారోగ్యాలను గుల్ల చేశారు. జగన్ ఏలుబడిలో ఎగబాకిన నకిలీ మద్యం అమ్మకాలు మూలంగా చుట్టుముట్టిన నానా రోగాలు, పడిపోయిన కుటుంబ ఆదాయాలు, గడచిన ఐదేళ్లలో లక్షల కోట్లమేరకు ప్రజానీకానికి నష్టం వాటిల్లినట్లు, విషతుల్యమైన మద్యం కారణంగా ఎన్నో తాళిబొట్లు తెగిపోయినట్లు, మద్యం సరఫరా సంస్థలనుంచి రూ.3,113 కోట్ల వరకు కమీషనన్లు దండుకున్నట్టు సమాచారం.

అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఐదేళ్లలోనే వేలకోట్ల వ్యాపార సామ్రాజ్యం నిర్మించుకోవడం ఎట్లాగో జగన్‌కి తెలిసినంతగా దేశంలో మరొకరికి తెలియదు. తండ్రి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నందుకే అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేలకోట్ల సంపద పోగేసుకున్న జగన్మోహన్‌రెడ్డి, తర్వాత తానే ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు ఇంకెన్ని వేల కోట్లు పోగేసుకొని ఉంటారో ఏ ఆర్థిక నిపుణుడు లెక్క తేల్చగలడు? ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన రూ.వేల కోట్ల లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక నిందితుడిని సిట్ అరెస్టు చేసింది. జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఈ కేసులో సిట్ అరెస్టు చేసింది. లిక్కర్ కుంభకోణం కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేశారు. ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. చాణక్య, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి విచారణ తర్వాత ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలను నిందితులుగా చేరూస్తూ సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. ముడుపులు ద్వారా వచ్చిన డబ్బును షెల్ కంపెనీలకు మళ్లించడంలో బాలాజీ తెరవెనుక వ్యవహారం నడిపినట్టు సిట్ అధికారులు గుర్తించారు. గతంలో విజయసాయిరెడ్డి తరహాలోనే ఈయన కూడా చార్టెడ్ అకౌంటెంట్‌గా తన తెలివి తేటలు ఉపయోగించి తాడేపల్లి ప్యాలెస్‌కు డబ్బు మూటలు తరలించినట్లు ఆధారాలను సిట్ గుర్తించింది. ఈనెల 11న విచారణకు రావాల్సిందిగా 9న ఇచ్చిన నోటీసును తిరస్కరించి, గోవిందప్ప అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన ఆచూకీని కర్ణాటకలో గుర్తించిన సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. జగన్ ప్రభుత్వంలో తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.3,200 కోట్ల మద్యం ముడుపులు చేరినట్టు పెద్దఎత్తున ఆరోపణలు వున్నాయి. తాడేపల్లిప్యాలెస్‌కు మద్యం డబ్బులు చేర్చడంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల పాత్రను సిట్ అధికారులు గుర్తించారు. వీరిలో బాలాజీ వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్. ఈయన 2009లో అప్పటి ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ విజయసాయిరెడ్డి వద్ద చేరారు. ఆయన ద్వారానే జగన్ కుటుంబానికి దగ్గరై, తర్వాత విజయసాయిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో బాలాజీ పూర్తిస్థాయిలో భారతీ సిమెంట్స్‌తో పాటు జగన్, భారతి ఆర్థిక లావాదేవీలను దగ్గరుండి చక్కబెడుతూ, వారికి అత్యంత సన్నిహితునిగా మారారు. అనతి కాలంలోనే భారతీ సిమెంట్స్ డైరెక్టర్‌గా ఎదిగారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక లిక్కర్ పాలసీ మొదలు ముడుపుల వసూళ్ల వరకూ ప్రతి దోపిడీలో బాలాజీ పాత్ర ఉన్నట్టు సిట్ దర్యాప్తులో వెల్లడయింది. రాజ్ కసిరెడ్డి తెచ్చి ఇచ్చిన కోట్లాది రూపాయల మద్యం ముడుపులను ఊరూ పేరూ లేని షెల్ కంపెనీల్లోకి మళ్లించడంలో మాస్టర్ మైండ్ గోవిందప్పదేనని సిట్ తేల్చింది. మొత్తం మద్యం బాగోతాన్ని పసిగట్టిన అధికారులు ఆయనను విచారించి అంతిమ లబ్ధిదారు ఎవరో తేల్చబోతున్నారు. రూ.వేల కోట్ల రూపాయలు ఎవరికి చేరాయి? ఎవరి ఆదేశాల మేరకు ఎక్కడకు చేర్చారు? రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో సృష్టించిన షెల్ కంపెనీలు ఎవరివి? వాటిలో ఎవరి పేరుతో పెట్టుబడులు పెట్టారు? నకిలీ జీఎస్టీ ఇన్వాయిస్, హవాలా మార్గంలో వెళ్లిన డబ్బుల వివరాలు లెక్క తేల్చాలి. గతంలో ఎన్నడూ జరగని విధంగా జరిగిన ఈ కుంభకోణంలో పిల్ల చేపలకే పరిమితం చెయ్యకుండా అంతిమంగా లబ్ది పొందిన తిమింగలాన్ని అరెస్టు చెయ్యాలి.

జగన్మోహన్‌రెడ్డి ధనదాహం అంతులేనిది. నేరాలు చెయ్యడంలో సిద్ధహస్తులు అయిన ఇద్దరు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లను ఆయుధాలుగా ఉపయోగించి లక్షల కోట్లు ప్రజాధనం కైంకర్యం చేశారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి ఆడిటర్‌గా డొల్ల కంపెనీల ద్వారా జగన్ దోపిడీకి బాటలు వేశారు. తండ్రి వైఎస్ పదివీ హయాంలో తనయుడు జగన్‌కి లబ్ధి కలిగించేందుకు సూట్‌కేసు కంపెనీలు ఏర్పాటు చేయించి.. రూ.43వేల కోట్ల కుంభకోణంలో సీబీఐ విజయసాయిరెడ్డి పాత్ర ప్రధానమైనదిగా సీబీఐ గుర్తించింది. జగన్‌పై సీబీఐ నమోదు చేసిన, ఈడీ చార్జిషీట్లు అన్నింటిలోనూ సాయిరెడ్డిని కూడా ఏ2గా చేర్చింది. విజయసాయిరెడ్డిని అరెస్టు చేసి అప్పట్లో చంచల్‌గూడ జైలుకు కూడా పంపించింది. ఇప్పుడు జగన్ సీఎంగా ఉండగా జరిగిన మద్యం ముడుపులను ఊరూ పేరూ లేని షెల్ కంపెనీల్లోకి మళ్లించడంలో సీఏ బాలాజీ గోవిందప్ప ప్రధాన పాత్ర పోషించి సిట్‌కు చేతికి చిక్కి జైలు ఊచలు లెక్కిస్తున్నారు. ఏదేమైనా జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన రూ.వేల కోట్ల ముడుపుల సొత్తుతో స్థిరాస్తి రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు సిట్ గుర్తించింది. బెంగళూరులోనే రూ.వెయ్యి కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టినట్లు కీలక సమాచారం. ముడుపుల డబ్బును డొల్ల కంపెనీల ద్వారా పలు స్థిరాస్తి సంస్థల్లోకి మళ్లించటంలో సిద్ధహస్తుడు అయిన భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీతో పాటు జగన్, భారతిలకు అత్యంత సన్నిహితుడైన మరో వ్యక్తీ క్రియాశీలక పాత్ర పోషించినట్లు సిట్ చెబుతున్నది. ఎక్కడెక్కడి నుంచి ఎంతెంత ముడుపులు వచ్చాయి, వాటిని ఏయే మార్గాల ద్వారా మళ్లించి స్థిరాస్తి సంస్థల ఖాతాల్లోకి మళ్లించాలనే దానిపై బెంగళూరు ప్యాలెస్‌లోనే వారానికోసారి నిర్వహించే సమావేశాల్లో వీరిద్దరూ పాల్గొనే వారని కూడా సమాచారం సేకరించింది. గోవిందప్ప అరెస్టు కావటంతో అతనితోపాటు ఆ రెండో వ్యక్తినీ అదుపులోకి తీసుకుని విచారిస్తే మద్యం కుంభకోణం అసలు భాగోతం, అంతిమ లబ్ధిదారుడు ఎవరూ అనే గుట్టు వీడనున్నది. ప్రస్తుతం సిట్ అధికారులు ముడుపులు అందుకొన్న అసలు తిమింగలం ఎవరో నిగ్గు తేల్చాలి. అంతేకాదు మద్యం కుంభకోణంలో పిల్ల చేపలను అరెస్టు చెయ్యడంకాదు అంతిమంగా భారీ లబ్ది పొందిన తిమింగలాన్ని అరెస్టు చెయ్యడం, మేసిన ప్రతి పైసాను కక్కించడమూ ప్రభుత్వ బాధ్యతే. అవినీతికి పాల్పడటమే కాదు నాణ్యతలేని మద్యంవల్ల బలి అయ్యింది బడుగు, బలహీనవర్గాలే. నిరుపేదలే వేలమంది ప్రాణాలు గాలిలో కలిసి పొయ్యాయి. ఇంతటి హేయమైన కుంభకోణం దేశం ఎక్కడా జరగలేదు!

- నీరుకొండ ప్రసాద్

# ఏపీ రాజకీయాన్ని మార్చేసిన ఎన్టీఆర్

## యజ్ఞనారాయణపురంలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఖమ్మం (చైతన్య రథం): ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం యజ్ఞ నారాయణపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎన్టీఆర్ తనయులు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీశ్, శ్రీయాస్ శ్రీనివాస్, మందలపు సుధాకర్, పోటు సరస్వతి, రంజిత్, నవీన్ చంద్ర, ఇతర రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





కార్యక్రమంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, తెలుగుదేశం పోలిట్‌బ్యూరో సభ్యులు టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ... యజ్ఞ నారాయణపురం ఒక చిన్న గ్రామం. ఇలాంటి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఇంత భారీగా ప్రజలు తరలి వచ్చారంటే అన్నగారిపట్ల ప్రజలకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఆయన స్వర్గస్థులై 30 ఏళ్లవుతున్నా.. ఆయనపట్ల ప్రజలకు అదే అభిమానం. ఎన్టీఆర్‌లాంటి నాయకులు మరొకరిని ఊహించలేం. ఎన్నేళ్లయినా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చి రాజకీయానికి సరికొత్త అర్థం చెప్పారు. వాటిని ఇప్పటికీ పాలకులు అనుసరించడం ఎన్టీఆర్ దార్శనికతకు నిదర్శనం. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా జరిపిన యజ్ఞనారాయణపురం టీడీపీ నాయకులకు, ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు. మేము ఎన్టీఆర్ శతజయంతి, ఇప్పుడు 75 ఏళ్ల సినీ స్వర్ణోత్సవం కార్యక్రమాన్ని ప్రపంచంలో దేశ, విదేశాల్లో జరుపుతున్నాం. అలాగే ఎన్టీఆర్ గురించిన సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. తరతరాల ప్రజలు తెలుసుకోవాల్సిన చరిత్ర అన్నగారిది. ఆంధ్రాలో మాదిరిగా తెలంగాణలో కూడా రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వమే వస్తుందని టిడి జనార్ధన్ అన్నారు.

నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ... యజ్ఞనారాయణపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఎండల్ని లెక్క చేయకుండా ఎంతోమంది ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి కృతజ్ఞతలు. అలాగే ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులు, యజ్ఞనారాయణపురం నేతలు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.

సినీరంగంలో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్, తెలుగు రాజకీయాలను కొత్త మలుపు తిప్పారు. నటుడిగా ఉన్నప్పుడే ప్రకృతి విలయాలు సంభవించినప్పుడు, ఇండియా పాకిస్థాన్ యుద్ధం జరిగినప్పుడు విరాళాలు సేకరించి ప్రజలకు, సైనిక సంక్షేమ నిధికి అందజేశారు. ప్రాంతాలకు అతీతంగా తెలుగు జాతి మొత్తం ఒక్కటేనని చాటిన మహానుభావుడు ఎన్టీఆర్. ఆయన ఆశయాల స్ఫూర్తితో మనమంతా ముందుకు వెళ్లాలని అన్నారు.

# మద్యం కుంభకోణంలో.. ఎవరూ తప్పించుకోలేరు

- పాత్రదారులు, సూత్రధారులు అందరూ దొరుకుతారు
- ఢిల్లీ మద్యం కుంభకోణంలో రూ.వందకోట్లకే అక్కడి సీఎం, డిప్యూటీ సీఎం అరెస్ట్
- ఏపీలో రూ.వేల కోట్ల కుంభకోణం
- సిట్ విచారణలో నిజాలు బయటకు వస్తున్నాయి
- అందుకే అబద్ధపు రాతలతో జగన్ రెడ్డి మీడియా విషం చిమ్ముతోంది
- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను ప్రభుత్వ షాపుల్లో అమ్మి.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు
- పేరున్న బ్రాండ్‌లను తరిమికొట్టి.. సొంత బ్రాండ్‌లకు ఆర్డర్లు ఇచ్చుకొని కమీషన్‌లు దండుకున్నారు
- నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీశారు
- నేడు మద్యం అమ్మకాలపై మళ్లీ సిగ్గులేని రాతలు
- ఎక్సయిజ్ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరిగిన అతి భారీ మద్యం కుంభకోణంలో నిజాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుంటే దీనికి సూత్రధారి, పాత్రధారి అయిన జగన్‌రెడ్డి విషపత్రిక సాక్షిలో అసత్య ప్రచారం చేయిస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. జగన్ రెడ్డి తొత్తుల మద్యం దందా బాగోతాలు బయట పడుతుంటే సాక్షి పత్రికలో అబద్ధాలతో కూడిన కథనాలను ప్రచురిస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జగన్ పాలనలో కమీషన్‌ల కోసం పేరున్న మద్యం బ్రాండ్‌లను రాష్ట్రం నుండి తరిమికొట్టి.. సొంత బ్రాండ్లకే ఆర్డర్లు ఇచ్చి.. దోచుకోవడానికి డిజిటల్ లావాదేవీలు లేకుండా చేసి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అమ్మి.. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారన్నారు. అలాగే నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీశారన్నారు. నేడు అవి ఒక్కొక్కటిగా సిట్ విచారణలో బయటకు వస్తుంటే.. ఓర్వలేని జగన్ రెడ్డి విషపత్రిక.. అసత్య ప్రచారం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో సొంత లాభాల కోసం మద్యం అమ్మకాలను భ్రష్టుపట్టించారు. నేడు వారు చేసిన పాపాలు బయటకు వస్తుంటే జగన్ రెడ్డి నీచ పేపర్ తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది. జగన్ రెడ్డి తొత్తుల బాగోతాలు బయటపడుతుంటే అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారని మంత్రి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### డిజిటల్ చెల్లింపులు ఎందుకు అనుమతించలేదు..

కూటమి ప్రభుత్వం వచ్చాక విడుదల చేసిన శ్వేత పత్రాల్లో మద్యంలో ఏ విధంగా దోపిడీ చేశారో స్పష్టంగా చెప్పాం. వైసీపీలో నెంబర్ 2గా ఉన్న వ్యక్తి కూడా విచారణలో ఇదే చెప్పారు. విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, గోవిందప్ప, ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల పాత్రలపై స్పష్టమైన ఆధారాలతో వార్తలు వస్తుంటే.. తప్పుడు కథనాలు రాయిస్తూ మసిపూసి మారేడుకాయ చేయాలనుకుంటున్నారు. వీరంతా నిన్నటి వరకు ఎవరితో ఉన్నారు. సిట్ విచారణలో పాత్రదారులు, సూత్రధారులు ఎవరెవరో అంతా బయటకు వస్తుంది. 2019 వరకు వీరికి ఎవరికైనా మద్యం వ్యాపారాలతో సంబంధాలు ఉన్నాయా? 2019 వరకు మద్యం వ్యాపారంతో సంబంధం లేని వీళ్లు వైసీపీ ప్రభుత్వంలోనే మద్యం వ్యాపారంలోకి వచ్చింది వాస్తవం కాదా? దీనికి పూర్తి ఆధారాలు ఉన్నాయి. అయినా ఇంకా మభ్యపెట్టాలని చూస్తున్నారు. 10 మద్యం డిపోలను తాకట్టు పెట్టి రూ.13 వేల కోట్లు తీసుకొచ్చి దారి మళ్లించి కమీషన్‌లు కొల్లగొట్టింది వాస్తవం కాదా? ఏఆర్ఈటీ అని పెట్టి రూ.23 వేల కోట్లు అప్పులు తీసుకొచ్చింది వాస్తవం కాదా? భవిష్యత్‌కు సంబంధించిన అమ్మకాల రాబడిని కూడా తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చి ఆ డబ్బులను దారి మళ్లించి కమీషన్లు కొల్లగొట్టింది వాస్తవం కాదా? ఆదాన్, లీలా, ఎన్వీ, వీ 9, సోనా, మూనాక్ అనే కంపెనీలు 2019 ముందు ఏపీలో ఉన్నాయా? ఈ కంపెనీలు ఎలా పుట్టుకొచ్చాయి?



దీనికి సమాధానం చెప్పగలరా? రేట్లు పెంచింది మీరు కాదా? ఎక్కడా డిజిటల్ లావాదేవీలు లేకుండా రూ. 99,413.5 కోట్ల మేర కేవలం నగదు చెల్లింపులనే ప్రోత్సహించారు. ఇంత డబ్బు ఎక్కడికి వెళ్లింది? ఎవరి ప్యాలెస్‌కు వెళ్లింది? డైరెక్ట్‌గా షాపుల్లో వైసీపీ సొంత మనుషులను పెట్టుకొని ప్రభుత్వం నుండి సప్లై చేసే మద్యాన్ని లేకుండా చేసి.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తెచ్చి అమ్మి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి వారి జేబులను నింపుకున్నారని మంత్రి రవీంద్ర ధ్వజమెత్తారు.

### సొంత బ్రాండ్లకు ఆర్డర్లు

సొంత బ్రాండ్‌లు మాత్రమే షాపుల్లో పెట్టి, మల్టీ నేషనల్ కంపెనీలను రానివ్వకుండా ప్రజా ఆరోగ్యానికి తూట్లు పొడిచారు. మేము అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా మద్యం విధానం అమలు చేసి షాపులు కేటాయించాం. అమ్మకాల సమయాన్ని తగ్గించామని, షాపులు తగ్గించామని సిగ్గులేని రాతలు రాస్తున్నారు. 2020 నాటికి 2,934 షాపులు ఉంటే, వాటిని 3,396 షాపులకు పెంచింది వాస్తవం కాదా? మేము ఎక్కడా షాపులు పెంచలేదు. వైసీపీ హయాంలో బెల్ట్ షాపులు లేవని చెబుతున్నారు. బెల్ట్ షాపులు లేకపోతే మీరు లక్ష కేసులు ఎలా పెట్టారు? షాపులు మీ సొంత మనుషులతో పెట్టి విచ్చలవిడిగా అమ్మించింది వాస్తవం. అవన్నీ సిట్ విచారణలో బయటకు వస్తాయి. మల్టీ నేషనల్ కంపెనీలకు ఆర్డర్లు ఇవ్వకుండా, మీకు సంబంధించిన బ్రాండ్‌లకు మాత్రమే ఆర్డర్స్ ఇచ్చారు. 2019-2024 మధ్య 43 బ్రాండ్‌లకు మాత్రమే ఆర్డర్స్ ఇచ్చారు. నేడు దాదాపు 300 బ్రాండ్‌లకు ఆర్డర్లు ఇస్తున్నాం. కేవలం 43 బ్రాండ్‌లకు ఆర్డర్స్ ఇచ్చి కోట్లు కొల్లగొట్టింది వాస్తవం కాదా? నేడు బాటిల్ తయారీ నుండి షాపులు, కొనుగోలుదారుని వద్దకు వెళ్లేవరకు ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్ పెట్టాం, ట్రాకింగ్ చేస్తున్నాం. కొన్ని డిస్టిలరీలను భయపెట్టి, వాటిని లాక్కొని, అక్కడ మీ సొంత బ్రాండ్‌లను తయారు చేసుకోవడానికి వాడుకున్నారని మంత్రి రవీంద్ర విమర్శించారు.

### టెండర్ కమిటీ ఏర్పాటే లేదు

2019లో ప్రభుత్వం మారే నాటికి గతంలో తెలంగాణకు మనకు ఉన్న వ్యత్యాసం కేవలం రూ.4,186 కోట్లు మాత్రమే. గత ప్రభుత్వ పాలనలో రూ.42,762 కోట్ల వ్యత్యాసం ఉంది. ఈ ఆదాయం అంతా ఏమైంది? జగన్ బ్రాండ్ మద్యం తాగడం వల్ల లివర్లు, కిడ్నీలు చెడిపోయి చాలా మంది మరణించారు, మానసిక వ్యాధిగ్రస్తులుగా మారారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదైన రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు బయటపడుతున్నాయి. నాసిరకం మద్యం తాగి ప్రజలు ఆర్థికంగా కూడా నష్టపోయారు. నేడు ల్యాబ్‌ల్లో 12 రకాల టెస్ట్‌లను చేయిస్తున్నాం. నాడు మల్టీ నేషనల్ కంపెనీలకు బకాయిలు ఇవ్వకపోవడంతో వారు రాష్ట్రం నుండి వెళ్లిపోయారు. మల్టీ నేషనల్ కంపెనీలు తిరిగి మన రాష్ట్రానికి వస్తున్నాయి. మద్యం రేటు పెరగాలన్నా, కొత్త బ్రాండ్‌లు తీసుకురావాలన్నా టెండర్ కమిటీ ఆధ్వర్యంలో జరగాలి. కానీ గత ఐదేళ్లు టెండర్ కమిటీని ఏర్పాటు చేయలేదు. వారి బ్రాండ్‌లు సప్లయి చేసుకోవడం కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకున్నది వాస్తవం. ఒక్కో కేసుకు రూ. 150 నుండి రూ. 900 కమీషన్‌లు కొల్లగొట్టినట్లు వైసీపీ నేతలే చెప్పారు. ఇవన్నీ బయటకు వస్తున్నాయి. గతంలోనే మేము రూ.32 వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పాం. నేడు అవే లెక్కలు రుజువు అవుతున్నాయి. ఢిల్లీ కుంభకోణం కేవలం రూ.100 కోట్లకు సంబంధించింది. ఈ కేసులో ఢిల్లీ సీఎం, డిప్యూటీ సీఎం, పక్క రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కూతురు, శరత్ చంద్రారెడ్డిలు అరెస్ట్ అయ్యారు. ఏపీలో జరిగింది వేల కోట్ల స్కాం. ఇది బయట పడుతుంటే.. తప్పుడు కథనాలు రాసి.. బురద చల్లి తప్పించుకోవాలనుకున్నా.. ఎవరూ తప్పించుకోలేరని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత

- సచివాలయంలోని హోంశాఖ కార్యాలయం పరిశీలన



అమరావతి (చైతన్యరథం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం దర్శించుకున్నారు. జగన్మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుటుంబ సభ్యులతో కలిసి పట్టుచీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హోంమంత్రి అనితకు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ నూతన ఈవో శీనా నాయక్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం చిత్రపటం అందజేశారు. ఆలయం క్యూలైన్లలో భక్తులను ఆత్మీయంగా పలకరించి అమ్మ సన్నిధిలో వసతి సౌకర్యాల గురించి మంత్రి అనిత అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం హెంమంత్రి అనిత వెలగపూడి సచివాలయానికి వెళ్లారు. అక్కడ ప్రజలను కలిసి వారి అర్జీలు స్వీకరించారు. అనంతరం 2వ బ్లాక్ లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న హెంశాఖ కార్యాలయాన్ని హోంమంత్రి అనిత ఆకస్మికంగా పరిశీలించారు. ఫైళ్లు, రికార్డులను గురించి అడిగి తెలుసుకున్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తో కలిసి అన్ని ఛాంబర్లలోని సిబ్బందిని పలకరిస్తూ వారితో మాట్లాడారు. హోంశాఖకు వచ్చే అర్జీలు త్వరితగతిన పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారు.

## 30 రోజుల్లో భూకేటాయింపులు

- పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు
- ఎంఎస్ఎంఈల పురోగతిపై మంత్రి కొండపల్లి ఆదేశం
- ఎంఎస్ఎంఈలే గేమ్ చేంజర్ కాబోతున్నాయని వ్యాఖ్య

విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పార్కులలో భూ కేటాయింపులను కేవలం 30 రోజులలో పూర్తి చేయాలని రాష్ట సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. పార్క్‌లలో మౌలిక సదుపాయాలను మరింత వేగంగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతిపాదిత 175 సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల ఎంఎస్ఎంఈ పార్కులలో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా భూకేటాయింపు తదితర అంశాలపై ఏపీఐఐసి వైస్‌చైర్మన్ అభిషిక్త్ కిషోర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇటీవల ప్రారంభించిన 11 ఎంఎస్ఎంఈ



పార్కులలో భూమి కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారాల ను అందించాలని ఆదేశించారు.

పార్క్‌ల పనితీరు, జరుగుతున్న కార్యక్రమాలు, నిర్ణయాల అమలుపై కనీసం రెండు వారాలకు ఒకసారి సమావేశం నిర్వహించా లన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులలో భూ కేటాయింపుకు సంబంధించిన పురోగతిని ప్రతి 15 రోజులకు ఏపీఐఐసి అధికారులు అందించాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈలకు కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఈ-సిడీపీ పథకం కింద ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పార్క్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచాలని, తద్వారా పార్క్‌ల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు మానస పుత్రిక పీ4 మోడల్‌ను అన్వేషించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఓ షెడ్యూల్ సిద్ధం చేయాలని, క్యాలెండర్ ప్రకారం వాటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఎంఎస్ఎంఈ పార్క్‌లు గేమ్ చేంజర్ కాబోతున్నాయని, యువ పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి ఇది అద్భుతమైన వేదిక అని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కాబోయే ఈ పార్క్‌లు దేశ పారిశ్రామిక రంగానికి దిక్సూచి అవుతాయని మంత్రి ఆకాంక్షించారు. ఎంఎస్ఎంఈ పార్క్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అధికారులు ముఖ్యమంత్రి విజన్‌కు తగ్గట్టుగా పని చేయాలని మంత్రి శ్రీనివాస్ ఆదేశించారు.

# ప్రోత్సాహకాలే ప్రేరణకావాలి

- కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా బీసీ విద్యార్థుల విజయ భేరి
- బీసీ విద్యార్థుల ఉత్తమ ప్రతిభకు గుర్తింపే సన్మానాలు, ప్రోత్సాహకాలు
- జూన్ 15న తల్లికి వందనం ద్వారా రూ.15,000 అందజేత
- జూన్‌నుంచి అన్ని హాస్టల్స్‌లో సన్న బియ్యంతో భోజనం
- బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్ సవిత వెల్లడి
- 200మందికి సర్టిఫికెట్లు, మెమొంటోలు, 22మందికి నగదు పురస్కారాలు అందజేత




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో బీసీల విద్య కోసం బలమైన పునాదులు వేయటం వల్లే టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని చేనేత జౌళి మంత్రి ఎస్ సవిత అన్నారు. తుమ్మలపల్లి కళా క్షేత్రంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించటం గర్వించదగ్గ విషయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభకు పట్టంకట్టి వారిలో స్ఫూర్తి నింపుతుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన పిల్లలు మంచి ఫలితాలు సాధించాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. అందుకు అనుగుణంగా టీచర్లు, విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు భావితరాల భవిష్యత్‌కు పటిష్టమైన విద్యా వ్యవస్థ కోసం పునాదులు వేస్తున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తల్లికి వందనం క్రింద ప్రతి ఇంట్లో చదువుకునే ఆడబిడ్డకు జూన్ 15న రూ.15,000 అందిస్తామని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు తదితర మౌలిక ఏర్పాట్లు చేసామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల్లో టాయిలెట్స్ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది పది, ఇంటర్ ఫలితాల్లో బీసీ గురుకులాలు, హాస్టల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందనలన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీటవేసే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 109 గురుకులాల్లో 108 గురుకులాలు మా ప్రభుత్వ హయాంలో వచ్చినవేనన్నారు. ఆనాడు స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీలను విద్యాపరంగా ప్రోత్సహిస్తే అదే స్ఫూర్తిని ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గత ప్రభుత్వం బీసీ గురుకులాలు, హాస్టళ్ల మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. వెనుకబడిన తరగతుల పిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్ని హాస్టల్స్‌లో ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకుని భోజనం అందిస్తున్నామన్నారు. బీసీ యువతకు సివిల్ సర్వీసులో శిక్షణతోపాటు, మెగా డీఎస్సీకి శిక్షణను అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యా కూడా అందిస్తామన్నారు. ప్రపంచంలో ఎక్కడకి వెళ్లినా మహాత్మ జ్యోతిబా పూలే గురుకులాల్లో చదివామనే చెప్పుకునేందుకు గర్వంగా ఉండాలని, ఎంజేపీ గురుకులాల్లో చదివానని అందరూ గర్వంగా చెప్పుకునేలా విద్యాలయాలను తీర్చి దిద్దుతున్నామన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగంలో తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌ను అవసరం మేరకే వినియోగించాలని ఎక్కువగా వినియోగించవద్దని.. ఆ సమయాన్ని విద్యపై కేటాయించి జీవితంలో ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు వినియోగించుకోవాలన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే రాష్ట్రంలో అన్ని బీసీ సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. విద్యాదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ త్యాగాలను మనందరం గుర్తుంచుకోవాలన్నారు. ముందుగా జ్యోతిబా పూలే, దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌ల చిత్ర పటాలకు మంత్రి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యన్నారాయణ మాట్లాడుతూ ఏ విద్యార్థి అయినా నిరంతరం శ్రమిస్తేనే ఉన్నతంగా తన జీవితంలో స్థిరపడతారన్నారు. జీవితంలో తపనతోపాటు ఏదైనా సాధించాలనే లక్ష్యం ఉండాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగల్గుతారన్నారు. ముగింపు సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ డి. చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ప్రతిభను నిరంతరం కొనసాగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, బీసీ సంక్షేమ హాస్టల్స్ నుంచి 200 మందికి బ్యాగులు, సర్టిఫికెట్స్, మెమొంటోలు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన 22 మందికి నగదు పురస్కారాలు అందించారు. ఇందులో 8మంది బీసీ హాస్టల్స్‌కు చెందినవారు కాగా, 14 మంది ఎంజేపీ స్కూల్స్, కళాశాలలకు చెందినవారున్నారు. ప్రథమ బహుమతి పొందిన 12మందికి ఒక్కొక్కరికీ రూ. 20,000 చొప్పున, ఏడుగురికి ఒక్కొక్కరికీ రూ. 15,000 చొప్పున, ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల డాక్టర్ ఏ. మల్లిఖార్జున్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శి పీ మాధవీలత, ఏ కృష్ణమోహన్ తదితరలు పాల్గొన్నారు.

# ట్రేడింగ్ పేరుతో రూ. కోటి 16 లక్షల మోసం

- ల్యాబ్ పరికరాల వ్యాపారం అంటూ రూ. 5 కోట్లకు టోకరా
- న్యాయం చేయాలని బాధితుల వినతి
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెల్లువెత్తిన వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ





అమరావతి (చైతన్యరథం): వివిధ మోసాలతో పాటు భూ సమస్యలు, ఇతర సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి అర్జీ దారులు వెల్లువెత్తారు. ప్రజల నుండి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ట్రేడింగ్ పేరుతో పూనేకు చెందిన మహేష్ గాంధీ, మనేష్ జాదవ్‌లు రూ.కోటి 16 లక్షలు తీసుకొని తనను మోసం చేశారని.. దీనిపై పోలీసులు చర్యలు తీసుకొని తనకు న్యాయం జరిగేలా చూడాలని విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన దానేకుల కమల్ కుమార్ గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.

సత్యసాయి జిల్లా కదిరి మండలానికి చెందిన టి. షెమీమ్ గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ... అనంతపురం గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న పద్మశ్రీ కాలేజీకి సంబంధించిన ల్యాబ్ పరికరాల బిజినెస్ అంటూ తమ వద్ద రూ.5 కోట్లు వసూలు చేసి మోసం చేసిందని.. దీనిపై త్వరగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన సత్యనారాయణ విజ్ఞప్తి చేస్తూ.. తాము కొనుగోలు చేసిన ఇంటి తాళాలు పగులకొట్టి మధ్యవర్తులను పంపి కేశనశెట్టి లలిత అనే మహిళ తమను డబ్బులకోసం బెదిరిస్తుందని.. దయ చేసి ఆమెపై చర్యలు తీసుకొని తమకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటం మండలానికి చెందిన సీ.దానం విజ్ఞప్తి చేస్తూ.. తనను ఆటో గుద్దడం వల్ల కాళ్లు చేతులకు తీవ్ర గాయాలై.. రూ.7 లక్షలు ఖర్చు అయ్యిందని.. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు కట్టడంలేదని.. దయ చేసి కేసు కట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన పీరమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తన స్థలంలో అక్రమంగా ఇంటిని నిర్మించి తనపై కబ్జాదారులు దౌర్జన్యం చేస్తున్నారని.. దయచేసి అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

తన బంధువులే తన ఇంటికి వెళ్లే దారిని మూసేసి తనను ఇబ్బంది పెడుతున్నారని..దయచేసి అధికారులు జోక్యం చేసుకుని తన సమస్యను పరిష్కరించాని తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన ఎమ్. సత్యనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య జిల్లా కలకడ మండలం ముడియంవారిపల్లి ఎంపీయూపీ స్కూల్ టీచర్ ఎమ్.నాగలక్ష్మమ్మ విజ్ఞప్తి చేస్తూ.. స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి, ఎంఈఓ మునీంద్రనాయక్‌లు తనపై కక్షగట్టి స్థానిక వైసీపీ నాయకుల ద్వారా తప్పుడు పేపర్ స్టేట్‌మెంట్ ఇప్పించి గత ప్రభుత్వంలో తప్పులేకపోయినా తనను సస్పెండ్ చేయించారని, తనను వేధించిన ఎంఈఓ, హెచ్‌ఎంలపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్యులు, సహాయ సిబ్బంది ఖాళీల భర్తీకి..

# సత్వరం ప్రణాళిక

- గత ప్రభుత్వ నిర్వాకంతో ఎన్టీఆర్ వైద్య సేవలో నెలకొన్న అవినీతికి అడ్డుకట్ట వేయాలి
- ఆయుష్ వైద్య సేవల్ని మరింత విస్తృతం చేయాలి
- ఔషధ, సుగంధ మొక్కల సాగు పెంపుపై దృష్టి పెట్టాలి
- మెరుగైన వైద్య సేవల కోసం వివిధ విభాగాలు మరింత సమన్వయంతో పనిచేయాలి
- వైద్య,ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలపై సమీక్షలో మంత్రి సత్యకుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి త్వరలో ఏడాది పూర్తి కానున్నందున వైద్య,ఆరోగ్య శాఖలోని 9 విభాగాల పనితీరును, సాధించిన ఫలితాల్ని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సమగ్రంగా సమీక్షించారు. వెలగపూడి సచివాలయంలో ఉదయం 10 గంటలకు మొదలైన సమీక్ష సాయంత్రం 6 గంటల వరకు సాగింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు వివిధ విభాగాధిపతులు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

గత 11 నెలలుగా నమోదైన వైద్యులు, సహాయక సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ సేవల తీరు, మౌలిక సదుపాయాల కల్పన, గత ప్రభుత్వం నుండి వారసత్వంగా సంక్రమించిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, వివిధ విభాగాల్లో ఖాళీలు, బడ్జెట్ వ్యయం తీరుతెన్నులు, స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్‌లో ఆరోగ్య రంగానికి సంబంధించిన లక్ష్యాల సాధనకు మార్గాలు, ప్రభుత్వ వైద్య సేవల పట్ల ప్రజాభిప్రాయం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష జరిగింది.

### నియామకాలకు ప్రణాళిక

గత ప్రభుత్వం చెప్పుకున్న దానికి భిన్నంగా వివిధ విభాగాల్లో భారీ స్థాయిలో నెలకొన్న ఖాళీలు, వాటి పర్యవసానంపై చర్చ అనంతరం ప్రాధాన్యతల ఆధారంగా ఈ ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలో ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. సత్వర నియామకాల కోసం ఈ ప్రక్రియను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరిధి నుంచి రాష్ట్ర వైద్య సేవల నియామక బోర్డుకు (ఏపీఎంఎస్ఆర్బీ) కి మార్చడానికి తగు చర్యల్ని చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. గత 11 నెలలుగా వివిధ విభాగాల్లో జరిగిన నియామకాలపై మంత్రి సత్యకుమార్ వివరాలు తెలుసుకున్నారు.

### డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో అవినీతికి అడ్డుకట్ట

గత ప్రభుత్వ రాజకీయ జోక్యం, అక్రమాలతో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో నెలకొన్న అవినీతి సంస్కృతికి తక్షణమే అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. అవినీతితో కూడిన ఈ దోపిడీ వల్ల విలువైన ప్రజాధనం దారిమళ్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న ఆసుపత్రులు, అందుకు సహకరిస్తున్న దళారులు, అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,300 కోట్లు ఖర్చు చేసి గత ప్రభుత్వం చేసిన బకాయిలను తీర్చిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా భారీ మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు జరిగాయని మంత్రి తెలిపారు. కూటమి ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పించేందుకు మిశ్రమ పద్ధతిని(హైబ్రిడ్) త్వరలో అమల్లోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

### ఆయుష్‌కు ప్రాధాన్యత

ఎంతో ప్రజాదరణ పొందుతున్న ఆయుష్ వైద్య సేవల్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి రాష్ట్రంలో ఆయుష్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రంగం పునరుజ్జీవనానికి కేంద్రం సాయంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని...ఇందులో భాగంగా గత ఆర్థిక సంవత్సరానికి రూ.83 కోట్ల నిధుల్ని సాధించామని తెలుపుతూ...ఇందుకు భిన్నంగా 2021-24 మధ్య మూడేళ్ల కాలంలో గత ప్రభుత్వం ఆయుష్ రంగంపై ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదని తెలిపారు. ఈ విభాగంలో 50 శాతానికి పైగా ఉన్న ఖాళీలను శీఘ్రగతిన భర్తీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఆయుష్ సేవల విస్తృతితో రాష్ట్రంలో మెడికల్ టూరిజం పెరిగే అవకాశముందని మంత్రి అన్నారు.

### ఔషధ, సుగంధ మొక్కల సాగుకు ప్రోత్సాహం

ఆరోగ్య, వాణిజ్యపరంగా ఎంతో ప్రయోజనకరమైన ఔషధ, సుగంధ మొక్కల సాగును పెంచాల్సిన అవసరముందని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అటువంటి 30 రకాల మొక్కల పెంపకానికి రాష్ట్రంలో అనువైన వాతావరణం ఉందని, వీటి ఆరోగ్య, వాణిజ్య విలువలపై రైతుల్లో చైతన్యాన్ని కలిగించాలని ఆయన సూచించారు. ఈ దిశగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారుల్ని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

## డిమాండ్ మేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- అప్రకటిత విద్యుత్ కోతలు వద్దు - అధికారులకు విద్యుత్ మంత్రి గొట్టిపాటి ఆదేశం
- సచివాలయంలో ముగ్గురు సీఎండీలతో మంత్రి సమీక్ష
- వ్యవసాయ కనెక్షన్లు, కరెంట్ కోతలు, సూర్యఘర్ పనుల పురోగతిపై సమీక్ష



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, విద్యుత్ కోతలు, పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై చర్చించారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైన మేర వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ సీజన్ నాటికి దరఖాస్తు చేసుకుని, అర్హులైన ప్రతీ ఒక్క రైతుకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కరెంట్ కోతల పై సమాచారాన్ని అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించాలని ఆదేశించారు. అప్రకటిత కరెంట్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే స్థానిక ప్రజలకు ముందస్తు సందేశం అందేలా చూడాలని తెలిపారు.

### పెండింగ్ పనులు పూర్తి చేయాలి

విద్యుత్ శాఖలో పెండింగ్ పనులపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరా తీశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై సీఎండీలతో చర్చించిన మంత్రి... ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మరో వైపు క్షేత్ర స్థాయిలో పీఎం సూర్యఘర్ పై ప్రజల్లో అవగాహన కల్పించి, పునరుత్పాద విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఇటీవల మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి హాజరుకాగా.. మరో ఇద్దరు సీఎండీలు వర్చువల్‌గా హాజరయ్యారు.

## టీడీపీ ప్రభుత్వాల వల్లే రాయలసీమలో అభివృద్ధి

**సాగునీరందించేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు - మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



రాయచోటి (చైతన్యరథం): రాయలసీమ ప్రాంతంలో అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే ఎంతో కృషి చేశాయని రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకత్వంలో ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కొన్ని ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు రాయలసీమలో చేపట్టారన్నారు. రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వమే ప్రధానాధారంగా నిలిచిందన్నారు. నీటి సరఫరా, సాగునీటి సౌకర్యాల పెంపుపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రాయలసీమ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వమే నాంది పలికిందని తెలిపారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ ద్వారా శ్రీశైలం జలాల నుండి రాయలసీమ జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి. కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించడమే లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యత ఇచ్చి, దశలవారీగా పూర్తిచేసేందుకు నిధుల విడుదల చేసి, పనులు వేగంగా చేపడుతున్నారు. గలేరు-నగరి ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమకు సాగునీరు అందించేందుకు చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా చిత్తూరు, కడప జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి చేకూరనుంది. నీటి భద్రత కోసం మైక్రో లెవెల్ పనులు.. చెరువుల పునరుద్ధరణ, బోర్ల రీఛార్జ్, చిన్న నీటి నిల్వల నిర్మాణం మొదలైన వాటికి నిధులు కేటాయించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చంద్రబాబు కృషి చేశారు. రాయలసీమకు ప్రత్యేక నీటి మిషన్ కింద కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రతి మండలానికి నీటి వినియోగం, అవసరాలు, భూభాగ విశ్లేషణ ఆధారంగా ప్రాజెక్ట్‌లకు ప్రణాళిక రూపొందించారని మంత్రి మండిపల్లి తెలిపారు.

## మడకశిర నగర పంచాయతీ టీడీపీ కైవసం...

**- టీడీపీ కౌన్సిలర్ నరసింహరాజును చైర్మన్‌గా ఎన్నుకున్న కౌన్సిలర్లు**



మడకశిర (చైతన్యరథం): శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నగర పంచాయతీలో వైసీపీకి చెందిన చైర్మన్ మీద పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మడకశిర నగర పంచాయతీ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. 14మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా, స్వచ్ఛందంగా పట్టణ 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజుకు మద్దతుగా నిలిచారు. ఆర్డీఓ ఆనంద్ కుమార్ ప్రిసైడింగ్ అధికారిగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానంలో కౌన్సిలర్లతో పాటు నరసింహరాజుకు స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు మద్దతు తెలిపారు. మొత్తం 15మంది మద్దతుతో మడకశిర నగర పంచాయతీపై పసుపు జెండా రెపరెపలాడింది. మడకశిర నగర పంచాయతీ టీడీపీ ఖాతాలో చేరడం పట్ల నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# దీనుల పాలిట పెన్నిధి సీఎంఆర్‌ఎఫ్


● నేనున్నానంటూ పేదల ప్రజలకు భరోసా కల్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

● నియోజకవర్గ ప్రజలకు రూ.52 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



టెక్కలి (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజల పాలిట సీఎంఆర్‌ఎఫ్ పథకం ఒక వరంలా నిలుస్తుందన్నారు. టెక్కలి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమే లక్ష్యంగా అచ్చెన్నాయుడు అడుగులు వేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించేడమే కాకుండా... సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న దీనులకు కొండంత అండనిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి టెక్కలి నియోజకవర్గం పరిధిలోని 34 మంది బాధిత కుటుంబాలకు రూ.52,79,620 ఆర్థిక సాయాన్ని ఇటీవల చెక్కుల రూపంలో అందజేశారు. అత్యధికంగా కోటబొమ్మాళి మండలంలో బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్నారు. పేద ప్రజలకు అత్యవసర ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుని ఆర్థిక సాయం పొందవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చాక అధిక సంఖ్యలో బాధితులకు సాయం అందించింది. ఇటీవల కాలంలో దరఖాస్తులు చేసుకున్న వారికి అవసరమైన నిధులు ప్రభుత్వం నుండి విడుదల అయ్యే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నారు మంత్రి అచ్చెన్నాయుడు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు కృషిచేస్తున్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రేవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక సహాయం అందిస్తున్నారని నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే పెద్దఎత్తున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని అన్నారు. అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు.

## అంగరంగ వైభవంగా శ్యామలాంబ జాతర : మంత్రి గుమ్మిడి



సాలూరు (చైతన్యరథం): అంగరంగ వైభవంగా శ్యామలాంబ తల్లి పండుగను నిర్వహిస్తామని, వైసీపీ నాయకులు అడ్డుకున్నా పండగ చేసి తీరతామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో పండుగ అంగరంగ వైభవంగా జరిపించాలని ప్రజలతో కలిసి నిర్ణయించడం జరిగిందని, ఎలక్ట్రికల్ శాఖ మంత్రి గోట్టిపాటి రవికుమార్ శ్యామలాంబ పండుగ కోసం రూ. 1.60 కోట్ల నిధులు మంజూరు చేశారని, ఆ నిధులతో 20 ట్రాన్స్‌ఫార్మర్లు, 100 విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ విడుదల చేసిన రూ.2 కోట్లతో ఆలయ పరిసరాల్లో తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లు, రోడ్ల మరమ్మతులు చేపడుతున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామని సంధ్యారాణి తెలిపారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీ శానిటేషన్‌కు సరైన సామాగ్రి కూడా ఇవ్వలేదని, "తప్పు చేసినవాళ్లను అమ్మవారు చూసుకుంటారు," అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. శ్యామలాంబ జాతర సందర్భంగా ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీసుల ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారని అన్నారు.

**పీఎం అజయ్ పథకం నిధులు అందజేత**

ఉన్నతి పిఎం అజయ్ పథకం కింద సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన గండుపల్లి శ్రీదేవికి కిరాణా షాప్ నిమిత్తం లక్ష రూపాయలు లోన్, శివరాంపురం గ్రామానికి చెందిన వెలగాడ కామేశ్వరికి కిరాణా షాప్ నిమిత్తం లక్ష రూపాయల నిధులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం అందజేశారు. ఉన్నతి పిఎం అజయ్ పథకం ద్వారా సామాన్య ప్రజలకు ఆర్థిక సహాయం అందించటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు

నరసన్నపేట (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయంలో నాయకులు ఆక్రమణలకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పట్టణ టీడీపీ నాయకులు ఆరోపించారు. నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీలో ప్రభుత్వ నిధులతో పార్కు నిర్మాణంచేపడితే తప్పుడుపత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతి లేకుండా వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని గుర్తించాలన్నారు. వంశధార ఈఈ కార్యాలయంలో సమీపంలో వైసీపీ వార్డు సభ్యులు స్థలాన్ని కబ్జా చేసి తన బంధువులకోసం ఇళ్లు నిర్మించడంతో అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగ కార్యదర్శి జామి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం : ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మెట్టవలస గ్రామదేవత అశిరితల్లి పండగకు హాజరై అమ్మవారికి మొక్కుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు నా యకులతో మాట్లాడారు. చంద్రబాబు అంటేనే రాష్ట్ర ప్రజలకు గుర్తుకు వచ్చేది అభివృద్ధి అని అన్నారు. విజన్ గల నాయకుడు రాష్ట్రానికి అవసరమని ప్రజలు గుర్తించి మంచి మెజారిటీ ఇచ్చి ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న, ఎన్ని కష్టాలు ఉన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొ క్కటిగా అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి నాయకు లు కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు, టంకాల మౌళీశ్వరరావు, కంచరాన సూరన్నాయుడు తదితరులు ఉన్నారు.



## నీటి వనరులతోనే అభివృద్ధి : గౌతు శిరీష



పలాస (చైతన్యరథం): నీటి వనరులతోనే అభివృద్ధి జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టు నుంచి పట్టణానికి నీరందిస్తున్నట్లు చెప్పారు. కాశీబుగ్గలో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరం దించేందుకు రూ.63లక్షలతో నిర్మించిన సింధూరజలసిరిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతప్రభుత్వంలో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు మంత్రి హోదా లో ఉన్నా వంశధార నీరు శివారు భూములకు అందించలేకపోయారని, కనీసం మునిసి పాలిటీకి తాగునీరు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా సాగు, తాగు నీరందించినప్పుడు నాలుగేళ్లు మంత్రిగా ఉండి ఎందుకు పనులు చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు శ్వేతపత్రం అంటే తెలియదన్నారు. అనంతరం మునిసిపల్ అధికా రులు గౌతు శిరీష, శివాజీ, చైర్మన్ బల్ల గిరిబాబుకు సన్మానించారు. ప్రతి ఒక్కరూ సొంతింటి కల సాకారం చేసుకోవాలని గౌతు శిరీష పిలుపునిచ్చారు.

## సామజిక రుగ్మతులు తొలగించడంలో నాటకానిది ప్రథమ స్థానం

● ఇచ్ఛాపురంలో ఘనంగా ముగిసిన నాటిక పోటీలు

● విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే బెందాళం



ఇచ్ఛాపురం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం, కవిటి మండలం భైరిపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి వారి భైరిపురం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడురోజులుగా జరిగిన అంతర రాష్ట్ర ఆహ్వానిత నాటక పోటీలు గురువారంతో ఘనంగా ముగిశాయి. స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బెదాళం అశోక్‌బాబు అధ్యక్షతన 12వ తేదీన ప్రారంభమైన ఈ నాటిక పోటీలలో మొత్తం ఏడు నాటికలు ప్రదర్శించారు. అంతరించిపోతున్న ఈ కళను తిరిగి జీవంపోసే ప్రయత్నంలో భాగంగా నిర్వహించిన ఈ నాటికలు సమాజంలోని సామజిక రుగ్మతలను, కుటుంబ బంధాలను అద్భుతంగా చూపించి ప్రేక్షకుల మన్ననలు పొందాయి. ఈ పోటీలలో, ఇంద్రప్రష్టం, చీకటి పువ్వు మరియు నాన్ననే వచ్చేస్త వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. ఈ బహమతులను స్థానిక శాసనసభ్యులు బెందాలం అశోక్‌బాబు, ఇచ్ఛాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ దాసరి రాజు చేతుల మీదుగా విజేతలకు బాహూకరించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ... కళను బ్రతికించడానికి భైరిపురం గ్రామస్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మూడురోజుల పాటు జరిగిన ఈ నాటిక పోటీలు తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి ప్రముఖులు, రాజకీయ నాయకులు, వైద్యులు, ప్రభుత్వాధికారులు, పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాటిక పరిషత్ కన్వీనర్ సీపాన వెంకటరమణ, సర్పంచ్ పుల్లట రమాదేవి, ఎంపీటీసీ పిరియ జగదీశ్వరి, బీసిఏ అధ్యక్షకార్యదర్సులు రాజేష్, దేవేంద్ర, గున్న ప్రకాష్‌రావు, రాజు పుల్లట, కడియాల వెంకట్రావు కోనారి, పిరియా నర్సింగరావు, సనపల, హరిప్రసాద్, బెల్లెడ చక్రవర్తి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత

● మంత్రి అచ్చెన్న తనయుడు కింజరాపు కృష్ణ మోహన్ బాబు



టెక్కలి (చైతన్యరథం): కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ తొలి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి తనయుడు, యువనేత కింజరాపు కృష్ణ మోహన్‌బాబు అన్నారు. కోటబొమ్మాళి మండలం, తాటిపర్తి గ్రామంలో ఇటీవల నమోదు చేసుకున్నవారికి తెలుగుదేశంపార్టీ సభ్యత్వం కార్డుల పంపిణీ చేశారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ప్రతి కార్యకర్తకి పార్టీ అండగా ఉంటుందని కృష్ణమోహన్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నలకు అండగా ఉంటాం : కందుల దుర్గేష్



నిడదవోలు (చైతన్యరథం): ఆరుగాలం శ్రమించే రైతన్నకు విత్తనం నుంచి విక్రయం వరకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దగాపడిన రైతన్నకు కూటమి ప్రభు త్వం అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొంటుందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో మరో 8025 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. నిడదవోలు మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, పెరవలి మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరం మండలంలో 6,025 మెట్రిక్ టన్నులు అదనపు ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎవరు అధైర్య పడవద్దని, గతంలో పడిన పాట్లు ఏ ఒక్క రైతు పడకూ డదనే ప్రత్యేక శ్రద్ధ వహించా మన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ ప?థకం అమలుకానుందని తెలిపారు.

## కుల ధృవీకరణ పత్రాల్లో "ఓసీ వైశ్య"ని ఆర్యవైశ్యగా మార్చండి

**●సీఎంకు ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ వినతి**

**●సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



విజయవాడ (చైతన్యరథం): గవర్నమెంటు వారు విధి, విదానాల ప్రకారం రాష్ట్రంలో ఇంతకుముందు జరిగిన సర్వేలు/ కుల గణనలను బట్టి ఉన్న ఆర్య వైశ్యులను వైశ్య/శెట్టి / గుప్త/ కోమటి/ లాగా వివిధ వర్గాల వారుగా విభజించి చూపడం వలన రాష్ట్రంలో గవర్నమెంటు వారు నిర్వహించే అన్ లైన్ వెబ్ సైట్‌లలో, యాప్‌లలో కూడా ఆర్య, వైశ్యలను వివిధ వర్గాలుగా చూపించడం జరుగుతోందని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ ఆందోళణ వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండల రెవెన్యూ అధికారులు ఇచ్చే కుల ధృవీకరణ పత్రాలలో కూడా "ఓ.సి. వైశ్య" అని మాత్రమే వస్తుంది. అందువలన ఆర్యవైశ్య వర్గాల వారు ఒకవిధమైన తికమకకు గురౌతున్నారని, కాబట్టి ఇకపై గవర్నమెంటు వారి ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం ఉన్నవారిని, భవిష్యత్తులో జరగబోయే "కుల గణన" విషయంలో గానీ, యాప్‌లలో గానీ, ఆన్‌లైన్ సైట్లలో గానీ ఒకేవర్గంగా అదీ "ఆర్యవైశ్య" అనే విధంగానే ఉండేటట్లు చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ విన్నవించుకున్నారు. రాకేష్ అభ్యర్థనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి అందరం కలిసి పని చేద్దాం



విజయవాడ (చైతన్యరథం): చౌక దుకాణాల అసోసియేషన్ ప్రతినిధులు ఎండీయూ ఆపరేటర్స్‌తో పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం చేర్చాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో చాలా పల్లెల్లో, గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం కోసం చాలామంది ఇప్పటికీ ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కేజీ బియ్యం రూపాయల 46-10 పైసలు కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 29 వేల చౌక దుకాణాల ద్వారా 2 లక్షల 50 వేల మెట్రి టన్నుల బియ్యం, 6500 మెట్రిక్ టన్నుల పంచదార తదితర వస్తువులను ప్రజలకు అందజేస్తుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సహకారంతో ముందడుగు వేస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో పౌర సరఫరా శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ఎండి మన్వీర్ జిలాని మరియు చౌక దుకాణాల సంఘం ప్రతినిధులు మరియు ఎండియు ఆపరేటర్స్ పాల్గొన్నారు.

## పోలవరానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం : నిమ్మల

**● పాలకొల్లులో ఘనంగా సర్ అర్థర్ కాటన్ జయంతి వేడుకలు**



పాలకొల్లు (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టుతో పాటు అన్ని ప్రాజెక్టులు, కాలువలు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పాల్గొన్నారు. ఆనాడు ఆంగ్లేయుడైన మహానుభావుడు ఆర్థర్ కాటన్ ముందు చూపుతో ధవలేశ్వరం ఆనకట్టతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో కాలువల నిర్మాణాలకు కృషి చేశాడని తెలిపారు. గత జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టుతో పాటు అనేక ప్రాజెక్టులు, ఇరిగేషన్ వ్యవస్థ విధ్వంసంతో కాటన్ దొర ఆత్మ సైతం క్షోభిస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు అన్ని ప్రాజెక్టులు, కాలువలు పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా శ్రమిస్తున్నా రని అన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు సాగు, త్రాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పంట కాలవలు, మురుగు డ్రైన్ల మెయింటినెన్స్ పనులకు సీఎం చంద్రబాబు రూ.344 కోట్లను కేటాయించినట్లు మాట్లాడారు. త్వరలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు



నక్కపల్లి (చైతన్యరథం): మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు స్థానిక విలేకరులకు తెలిపారు. వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడకు వెళ్లినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. తమను చూసి ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులను పట్టుకుని వెళ్తుండగా, అనుమానం వచ్చి పట్టుకున్నామన్నారు. ఆరు ప్యాకెట్లతో వున్న 12 కిలోల గంజాయిని పట్టుకుని, కర్ణాటకకు చెందిన మునివెంకటప్ప, తమిళనాడుకు చెందిన కుప్పముత్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. మునివెంకటప్ప గతంలో ఒక హత్య కేసులో నిందితుడని, కుప్పముత్తు గంజాయి కేసులో నిందితుడని తెలిపారు. ఏజెన్సీ నుంచి బ్యాగుల్లో గంజాయిని తీసుకువస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

## గీతం వర్సిటీలో సర్ అర్థర్ కాటన్ జయంతి వేడుకలు



విశాఖపట్నం (చైతన్యరథం) గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ (సివిల్ ఇంజినీరింగ్ విభాగం) ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ జయంతిని గురువారం నిర్వహించారు. వర్సిటీలోని కాటన్ భవన సముదాయంలోని ఆయన విగ్రహం వద్ద ప్రొ-వీసీ ఆచార్య వై. గౌతమ్రావు, రిజిస్ట్రార్ ఆచార్య డి. గుణశేఖరన్, విభాగాధిపతి డాక్టర్. ముకుంద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి.. ముఖ్యంగా నీటిపారుదల రంగంలో కాటన్ అమూల్యమైన సేవలందించారని కొనియాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కాటన్ వంటి నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గోదావరి ఆనకట్టడంతో నేడు ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం కూడా ఎంతో లబ్ధి కలిగిందని, సాగునీరు, తాగునీటికి డోకా లేకుండా అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి కాటన్ అని కొనియాడారు.

## రైతులకు సబ్సిడీపై దాణా, విత్తనాల పంపిణీ




మాచర్ల (చైతన్యరథం): రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చదలవాడ అరవింద్ బాబు ఉద్ఘాటించారు. గురువారం కారంపూడి మండల కేంద్రంలోని పశు వైద్యశాల నందు రైతులకు సబ్సిడీపై పశువుల దాణా, పశు గ్రాస విత్తనాల పంపిణీ కార్యక్రమం అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, విశిష్ట అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబులు హాజరయ్యారు. 50 శాతం సబ్సిడీ పై పశువుల దాణా, 70 శాతం పశుగ్రాసం విత్తనాలను రైతులకు అందజేశారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి తూట్లు పొడిచారని ఎమ్మెల్యే జూలకంటి వాపోయారు. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పశువుల దాణా, పశు గ్రాసం కోసం అందించే గడ్డి విత్తనాలను సద్వినియోగ పరచుకుని, పాడి పరిశ్రమను వృద్ధి చేసుకోవాలని సూచించారు.

**వరికపూడిశెలను కచ్చితంగా పూర్తి చేస్తాం..!**

కూటమి ప్రభుత్వ హయాంలో, సీఎంచంద్రబాబు నేతృత్వంలో పల్నాడు ప్రజల జీవనాడి వరికపూడిశెలను కచ్చితంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అరవింద్ బాబు స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని.., నిలిచిపోయిన అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతు దృష్టి సారించినప్పుడే స్థితిగతులు మారతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోహన రెడ్డి, దుర్గి పశు వైద్యులు డాక్టర్ దిలీప్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, ఉన్నం లక్ష్మి నారాయణ, కర్ణ అమర సైదారావు, కారంపూడి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతిలో న్యాక్ ఏర్పాటుకు కృషి : ఎంపీ కేశినేని శివనాథ్

- భవననిర్మాణ రంగంలో నిర్మాణాలు నాణ్యంగా కట్టాలంటే నిపుణులైన భవన నిర్మాణ కార్మికులు అవసరం
- హైదరాబాద్‌లో న్యాక్ సందర్శించిన ఎంపీ కేశినేని, ఎ.బి.ఎ.వో.సి.డబ్ల్యూ.ఎ.సి చైర్మన్ గొట్టుముక్కల




విజయవాడ (చైతన్యరథం): నిర్మాణ రంగంలో నిర్మాణాలు నాణ్యంగా కట్టాలంటే నైపుణ్యం సాధించిన భవన నిర్మాణ కార్మికులతో పాటు అవసరమైన సిబ్బంది అవసరమని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)ను గురువారం ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ (ఎ.బి.ఎ.వో.సి.డబ్ల్యూ.ఎ.సి) చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఏపీ న్యాక్ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఎన్.ఎ.సిను సందర్శించటానికి విచ్చేసిన ఎంపి కేశినేని శివనాథ్, గొట్టుముక్కల రఘురామరాజు, ఏపీ న్యాక్ అధికారులకు తెలంగాణ న్యాక్ ట్రైనింగ్ డైరెక్టర్ శాంతిశ్రీ ఎన్.ఎ.సి ఘనస్వాగతం పలికారు. అనంతరం న్యాక్ అధికారులు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో ఇంజనీర్ విద్యార్థులు, నిరుద్యోగులు, భవన నిర్మాణ కార్మికుల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని, అది త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. అమరావతి రాజధాని పనులు రూ.60వేల కోట్లతో ప్రారంభమైయ్యాయని అమరావతి నిర్మాణానికి ఎంతోమంది సివిల్ ఇంజనీర్లు, సివిల్ వర్కర్స్, ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ అవసరం ఉందన్నారు. న్యాక్‌లో శిక్షణ పొంది నైపుణ్యం సంపాదించిన వర్కర్స్ వుంటే అద్భుతమైన రాజధాని తయారు అవుతుందన్నారు. కుటుంబ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో టెన్త్, ఇంటర్ అంతకంటే తక్కువ చదువుకే పరిమితమైన యువతకు ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా వుంటాయన్నారు. అలాంటి వారికి ప్రయోజనకరంగా వుండేందుకే అమరావతిలో న్యాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపీకి ఇలాంటి ఇన్‌స్టిట్యూట్ వచ్చే వరకు న్యాక్ సపోర్ట్ అందించాలని అధికారులను కోరారు. నిర్మాణ రంగంలో మెరుగైన అవకాశాలు అందుకునేందుకు చదువు లేని వారి దగ్గర నుంచి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతకు ఉపాది కల్పించటంలో ఎన్.ఎ.సి వారిధిగా నిలుస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1998లో సీఎంగా నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని న్యాక్ ప్రారంభించటం జరిగిందన్నారు. ఇప్పుడు ఈ ఎన్.ఎ.సిలో శిక్షణ పూర్తి చేసిన యువకులు దేశ విదేశాల్లో అవకాశాలు అందుకుంటున్నారన్నారు. న్యాక్ దినదినాభివృద్ధి చెంది దేశంలోనే నెంబర్ వన్ ఇన్ స్టిట్యూట్ పేరు సంపాదించుకోవటం రెండు తెలుగు రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాక్ ట్రైనింగ్ డైరెక్టర్ శాంతిశ్రీ, తెలంగాణ న్యాక్ సి.టి.టి.ఐ. ఎమ్.రాజిరెడ్డి, ఏపీ న్యాక్ రీజనల్ డైరెక్టర్ పి.మురళీధర్, న్యాక్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.రాజు, తెలంగాణ న్యాక్ ట్రైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్.డి.అన్వర్ బిన్ మహ్మమద్ పాల్గొన్నారు.

# భూ వివాదాన్ని భూవిశ్వాసంగా మార్చే ప్రక్రియ : పెమ్మసాని

- 2027 కల్లా ఏపీలో పూర్తి చేసేందుకు ప్రయత్నాలు
- భూ రికార్డుల రీ సర్వే డిజిటలైజేషన్ జాతీయ వర్క్ షాప్‌లో కేంద్రమంత్రి



గుంటూరు (చైతన్యరథం): "భూవివాద సమస్యల నుంచి భూ విశ్వాసం పెంపొందించే దిశగా భూ రికార్డుల రీ సర్వే డిజిటలైజేషన్ కొనసాగుతుంది." అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. గుంటూరు నగరంలోని స్థానిక ఐటీసీ హోటల్లో బుధవారం జరిగిన భూములు సర్వే/ రీసర్వే భూ రికార్డులు డిజిటలైజేషన్‌పై కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాతీయ వర్క్‌షాప్ కార్యక్రమానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ మరియు స్టాంప్స్ శాఖ రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌తో కలిపి గుజరాత్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాలలో ఈ రిసర్వే వర్క్ స్పీడ్‌గా జరుగుతుందని, అయితే స్పీడ్ తక్కువగా ఉన్న రాష్ట్రాలను కూడా కలిపి వర్క్‌లో వేగం పెంచాలనే ఉద్దేశంతో ఈ వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జాతీయ స్థాయి కార్యక్రమాలు గుంటూరులో తక్కువగా జరుగుతున్నాయనే కారణంతో ఈ కార్యక్రమాన్ని ఇక్కడ తీసుకురావడం జరిగిందని, అన్ని కేంద్రపాలిత ప్రాంతాలలో అలాగే ఇతర రాష్ట్రాలలో పనిచేసే ఉన్నతాధికారులు ఇక్కడికి రావడం శుభసూచికమన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి గురించి అందరూ తెలుసుకుంటున్నారని అన్నారు. భూమితో మనకున్న గౌరవరం విడదీయలేనదని, భూమిని మన దేశంలో ఒక సెంటిమెంట్, ఆర్థిక భరోసాగా భావిస్తారని తెలిపారు. రాష్ట్రంలో అనేక భూ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటం బాధాకరమన్నారు. కోర్టుల్లో పరిష్కారం కాని భూముల కారణంగా నిజమైన యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అమెరికాలో మనం ఉంటున్న ఇళ్లు, భూమి వద్దకే అధికారులు వచ్చి రిజిస్ట్రేషన్ చేసి వెళ్తారని, కేవలం అక్కడ 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించిందని, అటువంటి వ్యవస్థను మన దేశంలో తీసుకురావాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నామని అన్నారు. వందల సంవత్సరాలుగా ఉన్న భూముల సర్వేని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థలో ఉన్న సిబ్బంది కొరత, నిధులు సమస్య అధిగమించడంపై దృష్టి సారించామని, నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని అధికారులకు పెమ్మసాని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, భూ సర్వే చేపడతామన్నారు.

# 26 జిల్లాల్లోనూ ఏపీటీఎస్ సేవలు : మన్నవ మోహనకృష్ణ



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఐటీ అభివృద్ధికి తీసుకొస్తున్న కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా 26 జిల్లాల్లోనూ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయాలను ప్రారంభిస్తామని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకలాపాలను సమర్థంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ఏపీ అంతటా డిజిటల్ పాలనను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. "రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ విధానాలను అమలు చేసే నోడల్ ఏజెన్సీగా ఏపీటీఎస్ వివిధ రకాల సేవలను అందిస్తోంది. కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలో ఈ సంస్థ నమోదైంది. కీలకమైన సైబర్ సెక్యూరిటీ ఆడిట్లు, భద్రతా బలహీనతలను అంచనా వేసి వాటి పరిష్కారానికి చొరవ చూపే సామర్థ్యం మాకుంది. రాబోయే రోజుల్లో ఈ సైబర్ సెక్యూరిటీ ఆడిటింగ్ను కేవలం ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేటు రంగంలోకి విస్తరించబోతున్నాం. ఇందులో ముఖ్యంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా, ఆరోగ్యం, టెలికాం తదితర రంగాలు ఉండబోతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోనూ సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తద్వారా ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏపీటీఎస్ ప్రొక్యూర్మెంట్ సర్వీసెస్ లక్ష్యం సుమారు రూ.600 కోట్లుగా నిర్దేశించాం" అని మన్నవ మోహన్‌కృష్ణ తెలిపారు.

## మొదటి ఏడాదిలోనే ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

- టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన చీఫ్ విప్ జీవీ, మక్కెన



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో పేదల కోసం మొదటి ఏడాదిలోనే 5లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు అందించే దిశగా ప్రభుత్వ వేగంగా అడుగులు వేస్తోందన్నారు చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు. పట్టణాల్లో 2లక్షలు, గ్రామాల్లో 3లక్షల ఇళ్లు ఎన్టీఆర్ హౌసింగ్ కింద శరవేగంగా పూర్తి అవుతున్నాయని, త్వరలోనే లబ్ధిదారులకు అన్నివసతులతో కూడిన కొత్తఇంటి తాళాలు అంది స్తామన్నారు. వినుకొండ పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ పేదలందరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గృహ నిర్మాణాన్ని పరుగులు తీయిస్తున్నారని తెలిపారు. వినుకొండలో మొత్తం టిడ్కో ఇళ్లను 5 నుంచి 6 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 720 ఇళ్లు ఇప్పటికే 90% పూర్తయినట్లు తెలిపారు. 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 864 ఇళ్లు పూర్తి చేసి పేదలకి అందిస్తామన్నారు. 300 చ.అ. ఇంటిపై రూ.6.5లక్షలు, 430 చ.అ. ఇంటికి రూ.8.55 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 2లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి రూ.7వేల కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. పేదవాడంటే చులకన, నిర్లక్ష్యం కారణంగానే గత వైకాపా ప్రభుత్వం ఇలా కొత్తఇళ్లు కట్టకపోగా, మంజూరైన ఇళ్లను కూడా రద్దు చేసిందని వాపోయారు. అవినీతిలో ముందు, పేదల చేయూతలో వెనకన నిలిచిన వాళ్లు కేంద్రం నిధులు ఇచ్చినా... రాష్ట్రం వాటా ఇవ్వాల్సి వస్తోందని 51వేల టిడ్కోఇళ్లు రద్దు చేశారని మండిపడ్డారు. పైగా జగన్ నిర్వాకం కారణంగా 77వేల 600మందికి ఇళ్లు ఇవ్వకుండానే రుణాలు తీసుకున్నారని, ఈ ఈఎంఐల కట్టలేక పేదలు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. గత ప్రభుత్వం కట్టని ఆ అప్పు భారం తీర్చేందుకు ఎన్డీయే ప్రభుత్వ వచ్చాక రూ.140కోట్లు తీర్చుతున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే 50 నుంచి 90శాతం పూర్తి చేసిన ఇళ్లను ఎందుకు పేదలకు ఇవ్వలేకపోయా రని నిలదీశారు. ఆ నిర్వాకాలన్నీ సరిచేయడంతో పాటు ఇంకా ఇళ్లు లేని వారికి పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చి ఎన్టీఆర్ కాలనీల నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి టిడ్కో ఇంటిని పూర్తి చేసి తీరుతామన్నారు. గృహ నిర్మాణంలో ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50వేలు అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. గూడు లేని ప్రతిపేదకు ఇళ్లు అంచాలన్నదే ఎన్డీయే ప్రభుత్వ, సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలోటీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జున్ రావు కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్ల మరమ్మతులు



గన్నవరం (చైతన్యరథం): ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ నుండి రైతుల వ్యవసాయ భూముల మీదుగా పెనమలూరు వెళ్లే డొంక రోడ్లో విద్యుత్ స్తంభాలు పక్కకి ఒరిగిపోయి కూలిపోయే స్థితికి చేరగా విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఈ డొంక రోడ్ల ప్రయాణించే రైతులు ప్రాణాల అరచేతిలో పెట్టుకొని ప్రాణ భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న ఈ విద్యుత్ తీగల సమస్యను రైతులు ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఈ విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేసి వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. యార్లగడ్డ ఆదేశాల మేరకు గురువారం ఉదయం రంగంలో దిగిన విద్యుత్ శాఖ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి విద్యుత్ తీగలను సరి చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు రైతులు, ప్రజలు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి

బాపట్ల (చైతన్యరథం): ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా చేపట్టిన మన భారత సైనికులకు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం గం.4:00లకు బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్ నుండి జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు జాతీయ జెండాలు పట్టుకొని ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ జరుగును. రాజకీయ పార్టీలకు అతీతంగా జరగబోయే ఈ ర్యాలీలో పలువురు వ్యాపారవేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు, విద్యార్థులు, వివిధ హోదాలో ఉన్న ఉద్యోగస్థులు పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వేగేసిన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు.

# ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

- నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో రికార్డు
- 60 రోజుల్లో రూ.41 కోట్లతో రికార్డు స్థాయిలో 339 పనులు పూర్తి
- వేగంగా పనులు చేయడంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై నాయకుల ప్రశంసలు



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆయన శైలే వేరు. ప్రజా సేవ కోసం ఎంతవరకైనా వెళ్తారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసేవకే అకితమౌతారు. ఈ విషయం మరోసారి నిరూపణ అయింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఆ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఒకే రోజు 105 పనులకు ఆయన ప్రజలతో శంకుస్థాపన చేయించారు. మార్చి 6న చేపట్టిన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగించారు. దీంతో మొత్తం 339 అభివృద్ధి పనులు పూర్తి చేశారు. గురువారం ఈ పనులకు ప్రారంభోత్సవం చేసేందుకు నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానికులను ఆయన ఆహ్వానించారు. వాళ్లతోనే ఈ ప్రారంభోత్సవాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద రవీచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రికార్డు స్థాయిలో 339 అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రశంసల వెల్లువ కొనసాగుతోంది. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సీఎం చంద్రబాబునాయుడు లేఖ రాయడంతో పాలుగా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ సైతం అభినందించారు. టీడీపీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్రయాదవ్ సైతం ఈ ప్రారంభోత్సవంలో పాల్గొని శ్రీధర్‌రెడ్డి కృషిని అభినందించారు. అనంతరం బీదా రవీచంద్ర మాట్లాడుతూ... అధికారం చేపట్టిన 11 నెలల్లోనే కనీ వినీ ఎరుగని రీతిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాలను, శిలాఫలకాల ఆవిష్కరణలను ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో మాత్రం ప్రజలు, కార్యకర్తలే ప్రారంభకులుగా ఉండటం విశేషం. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మూడు సార్లు వరుసగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా గెలుపొందడం వెనుక ప్రజా మద్దతు, ఆశీస్సులు ఉన్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, ఆ ప్రాంత అభివృద్ధికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అవిశ్రాంత కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల నిర్మాణం

- వైజాగ్‌లోని తెన్నేటి పార్క్‌ను సందర్శించిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ఆహ్లాదకరమైన పార్కులను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో పార్కుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. వైజాగ్ లోని తెన్నేటి పార్క్ ను పరిశీలించిన కోటంరెడ్డి.. అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కులో సౌకర్యాల కల్పనకు ఏ ఏ శాఖల నుంచి నిధులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో.. కాసేపు రిలాక్స్ అవ్వడానికి, చిన్నారులు ఆహ్లాదకరంగా గడపడానికి పార్కులు కీలకమన్నారు. పార్కుల అవసరాలను గుర్తించి నుడా విస్తరించి ఉన్న ప్రాంతాలలో కూడా పార్కులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సూచనల మేరకు.. అవసరమైన చోట పార్కులను నిర్మించి అందులో మౌలిక వసతులు కల్పిస్తామ్మన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ఈ సందర్భంగా కోటంరెడ్డి స్పష్టం చేశారు.

# కలిసికట్టుగా పనిచేద్దాం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాదిద్ధాం




ఒంగోలు (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు అధ్యక్షతన గురువారం నగరంలోని బృందావనం ఫంక్షన్ హాల్ నందు ఒంగోలు రూరల్ మండల తెలుగుదేశంపార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ... టీడీపీలో గ్రూపు రాజకీయాలకు తావు లేదని మనమంతా టీడీపీ కుటుంబ సభ్యులమేనని పేర్కొన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న విభేదాలు ఉంటే కుటుంబసభ్యుల్లా కలిసికట్టుగా కూర్చొని సమస్యను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో టీడీపీకి వచ్చిన మెజార్టీపై పంచాయతీల వారీగా పోలింగ్ బూత్‌లో వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి చేసిన పనులను నాయకులు, కార్యకర్తలకు వివరించారు. భవిష్యత్తులో పార్టీకి పనిచేసిన వారికీ పదవల్లో గుర్తింపు ఇస్తామని, పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో 14 పంచాయతీలకు నూతన గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగిందని, మండల పార్టీ అధ్యక్షులుగా గుండపనేని శ్రీను, మండల తెలుగుయువత అధ్యక్షులుగా వలేటి రాంబాబు, 13 అనుబంద సంఘాల అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. మండల క్లస్టర్ కన్వినర్‌గా నల్లమోతు బాల గంగాధర్‌ని నియమించారు.

# జిల్లా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని సజ్జా దివ్వశ్రీని సన్మానించిన ఎం.ఎం.కొండయ్య



చీరాల (చైతన్యరథం): పదవ తరగతి ఫలితాలలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించిన సజ్జా దివ్యశ్రీని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య గురువారం సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సజ్జా దివ్వశ్రీ ఋ ఏడాది జరిగిన పరీక్షల్లో జిల్లా మొదటి స్థానం సాధించడం సంతోషంగా ఉందని, ఆమె మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. వేగంగా మారుతున్న సమాజంలో పోటీని ఎదుర్కొనేందుకు ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్య అనేది ఒక వ్యక్తి వ్యక్తిత్వ వికాసానికి మరియు సమాజ పురోగతికి అత్యంత కీలకమన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, నాడు- నేడు పేరుతో పాఠశాలలను సైతం వైసీపీ ప్రభుత్వం దోచుకుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్య వ్యవస్థ సర్వనాశనమైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్ వేటపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు జాగ్రత్తని పోతురాజు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కూటమి పాలనతో సాధ్యం

- సర్వేపల్లి రైతులకు పలుయంత్రాలు పంపిణీ చేసిన సోమిరెడ్డి



సర్వేపల్లి (చైతన్యరథం): రైతు సంక్షేమం కూటమి పాలనతో సాధ్యమని, ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కూటమి పాలన రాకతో వ్యవసాయ శాఖ ఊపిరి పోసుకుందని, ఐదేళ్ల తర్వాత మళ్లీ యాంత్రీకరణ చేపట్టడంతో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. గురువారం వెంకటాచలం మండలంలోని 30 మంది రైతులకు పవర్ స్ప్రేయర్లు, ఇద్దరికి బ్రష్ కట్టర్లను సోమిరెడ్డి అందజేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖను మూతేశారని మండిపడ్డారు. దేశమంతా అమలైన అనేక వ్యవసాయ పథకాలు ఏపీ రైతులకు అందకుండా పోయాయని, టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ వ్యవసాయ శాఖలో యాంత్రీకరణ ప్రారంభమైందన్నారు. ఒక్కో పవర్ స్ప్రేయర్ పై రూ.10 వేలు, బ్రష్ కట్టర్‌పై 17,340 సబ్సిడీ ఉందని, రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరణించిన కార్యకర్త కుటుంబానికి ప్రమాద భీమా చెక్కు అందజేసిన మంత్రి డోలా



కొండపి (చైతన్యరథం): ప్రమాదంలో మరణించిన కొండపి నియోజకవర్గ టీడీపీ కార్యకర్త తానికొండ వెంకటరావు కుటుంబానికి రూ.5 లక్షల కార్యకర్తల భీమా చెక్కును రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కార్యకర్తల కష్టాల్లో చంద్రబాబు, లోకేశ్ అండగా నిలుస్తున్నారని దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ కోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పనిచేసే కార్యకర్తలు టీడీపీ సొంతమని, టీడీపీ రాజకీయ పార్టీ కాదు..ఓ ఆత్మీయ కుటుంబమన్నారు. కార్యకర్తలకు మంచి చేసే విషయంలో చంద్రబాబు, లోకేశ్ ఎప్పుడూ ముందే ఉంటారని అన్నారు. సీఎం చంద్రబాబు మంత్రులు లోకేశ్, డీబీవీ స్వామికి కార్యకర్త కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాప్తాడులో రికార్డ్ స్థాయి వర్షపాతం

**●భారీ వర్షాలపై అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత**



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం రూరల్ ప్రాంతంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ ప్రజాశక్తి నగర్, సిపిఎం కాలనీ, బిజెపి కాలనీ అలాగే రాప్తాడు మండల పరిధిలోని కందుకూరు గ్రామ సమీపంలో ఉన్న సిపిఐ కాలనీలో నీరు పెద్ద ఎత్తున చేరింది. శిల్ప లేపాక్షి నగర్ లోనూ నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సూచనలు చేశారు. అనంతరం వారికి ఇళ్లలో నిత్యవసరాలు తడిచిపోవడంతో ఉదయం, మధ్యాహ్నం అల్పాహారం, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కాలనీల్లోకి వచ్చిన నీరుని వంకల్లోకి మరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఎక్కడ ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మధ్యాహ్న సమయానికి కాలనీల్లో నీరు పూర్తిగా తగ్గేలా చూసారు. వరదనీటి కారణంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. మరోవైపు రాప్తాడు జాతీయ రహదారి నుంచి కందుకూరుకు వెళ్లే మార్గంలో సిపిఐ కాలనీలోకి నీరు రావడం పట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కల్వర్టును నిర్మిస్తే ఈ సమస్య ఉండదని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆమె ఈ విషయాన్ని కలెక్టర్ కు వివరించారు. కల్వర్టు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపట్ల కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు.

# 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

**●చంద్రబాబునాయుడు కాలనీలో ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్**

**● సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళిన కాలనీ వాసులు**





అనంతపురం (చైతన్యరథం): సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అనంతపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన మార్క్ ను చూపిస్తున్నారు. 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపి విపక్షాల ప్రశంసలను ఎమ్మెల్యే దగ్గుపాటి అందుకుంటున్నారు. తాజాగా రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్ నందు ఏళ్ల తరబడి సమస్యను పరిష్కరించారు. చంద్రబాబు నాయుడు కాలనీ ఏర్పడ్డాక ఇళ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అధికారులు ఏర్పాటు చేశారు. భయంతో ఇళ్ల మధ్యన ఉండాల్సిన పరిస్థితి కాలనీ ప్రజలకు ఏర్పడింది. గతంలో పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల చంద్రబాబు నాయుడు కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంలో ట్రాన్స్ ఫార్మర్ సమస్యను స్థానిక టిడిపి నాయకులు, కాలనీ వాసులు ఈ సమస్యను ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అక్కడి నుంచి ట్రాన్స్ ఫార్మర్ తీసివేయాలని అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. కాలనీలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ ఫార్మర్ ను మరోచోటికి మార్చాలని తెలిపారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఈ ట్రాన్స్ఫార్మర్ ను నివాస గృహాల మధ్యలో నుంచి వేరే చోటికి మార్చారు. 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపారని దగ్గుపాటి ప్రసాద్‌కు రుద్రంపేట పంచాయతీ టిడిపి నాయకులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన గౌరు చరితారెడ్డి

పాణ్యం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 17వ తేదీ శనివారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 20వ వార్డు కేంద్రీయ విద్యాలయం సమీపంలో ప్రజా వేదిక జరిగే సభ ప్రాంగణ ఏర్పాట్లను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పలు జిల్లాల్లో ఈదురుగాలితో కూడిన భారీ వర్షం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం తెల్లవారుజామున ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురిసింది. ఫలితంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇంక ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు రావడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. అలానే ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. అనంతపురం జిల్లాలో రాత్రి కురిసిన భారీ వర్షానికి రూరల్ మండల పరిధిలోని పలు కాలనీలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వాగు ఉధృతి పెరగడంతో ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీరు చేరింది. కక్కలపల్లి మండలం ప్రజాశక్తి నగర్, రాప్తాడు మండలం కందుకూరు సమీపంలో ఉన్న సీపీఐ కాలనీలో నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది. ఇంటి నుంచి బయటకు రాలేక కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వేసుకునే దుస్తుల నుంచి తినే ధాన్యం వరకు తడిసిపోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో చెత్తాచెదారం, అడ్డంగా పెరిగిన మొక్కలను తొలగించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. %వర్షం కురిసిన ప్రతిసారి తమ కాలనీలోకి నీరు వస్తోందని వాపోతున్నారు. కాలనీలో కనీసం రోడ్లు, మురుగు కాలువలు లేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఇళ్లలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. నీటి ఉధృతి అధికమవుతుండటంతో ఇళ్లల్లో ఎవరు ఉండకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

# హిందూపూరం ప్రభుత్వాసుపత్రిలో డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీలు - వైద్యుల తీరుపై ఆరా



శ్రీ సత్యసాయి జిల్లా (చైతన్యరథం): హిందూపురం ప్రభుత్వాసుపత్రిని ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈయనతో పాటు ఎమ్మెల్యే బాలకృష్ణ, కార్యదర్శి వీరయ్య ఉన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, వైద్యుల పనితీరు, ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలపై దాదాపు 2 గంటల పైగా ఆరా తీశారు. ఆసుపత్రిలో మార్చురీ గదిని ఆధునికంగా నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని, క్రిటికల్ కేర్ కేంద్రాన్ని నాణ్యతతో త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలను జారీ చేశారు. డయాలసిస్ కేంద్రంలో 2 రోజుల్లో ఏసీలను మరమ్మతులు చేయాలని అన్నారు. బ్లడ్ బ్యాంకులో కాంపోనెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అదే విధంగా 7 ఏళ్లగా నిరుపయోగంగా పడి ఉన్న సిటీ స్కాన్?కు మరమ్మత్తులు చేయించేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన వివరించారు. వైద్యులు పనితీరు ఆదర్శంగా ఉండాలని అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

**వైద్యసేవలను మెరుగుపరచాలి:** అంతేకాకుండా ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలని విస్తరించాలని పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న యుద్ధ వాతావరణ దృష్ట్యా వైద్యుల సెలవులను రద్దు చేసినట్లు పాల్ రవికుమార్ పేర్కొన్నారు. వైద్యుల పనితీరు వ్యక్తిగతంగా ఇక మీదట పూర్తిగా పరిశీలించి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు సంతృప్తి చెందే విధంగా వైద్య సేవలను అందించాలని వైద్యుల సమావేశంలో డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ వైద్యులకు సూచించారు.

# పుట్టపర్తి అభివృద్ధికి చేయూతనివ్వండి : ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి (చైతన్యరథం): భగవాన శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టే అభివృద్ధి పనులకు సామాజిక బాధ్యతగా చేయూతనివ్వాలని పలు కార్పొరేట్ సంస్థలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. బుధవారం పుడా, మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను జాయ్‌లుకాస్ కంపెనీ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కలెక్టర్ టీఎస్ చేతన, జాయ్‌లుకాస్ కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై చర్చించారు. పుట్టపర్తి పర్యాటకరంగం అభివృద్ధికి తగిన నిధులి స్వామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి నరసయ్య, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# 25న కుటుంబ సమేతంగా సీఎం గృహప్రవేశం



కుప్పం (చైతన్యరథం): కుప్పం సమీపంలోని శాంతిపురం మండల పరిధిలో నిర్మిస్తున్న సొంత గృహప్రవేశం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 25వ తేదిని ముహూర్తంగా నిర్ణయించారు.24వ తేదీన కుప్పం రానున్న ఆయన మరుసటి రోజున సకుటుంబంగా స్వగృహ ప్రవేశం చేయనున్నారు. ఇంటి నిర్మాణ ఏర్పాట్లను చంద్రబాబు కోడలు, మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి బుధవారం పరిశీలించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉండాలన్న లక్ష్యంతో చంద్రబాబు సొంత ఇల్లు నిర్మించుకోవాలని తలిచారు. వైసీపీ అధికారంలో ఉన్న 2019–2024 మధ్య కాలంలో స్థలంకోసం ఆయన టీమ్ తరపున స్థానిక నాయకులు అన్వేషణ సాగించారు. చివరకు శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ, శివపురం గ్రామ పరిధిలో రెండెకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణ అనుమతులకోసం పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేయం ఉడా)కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు చాలాకాలం వరకు అనుమతి లభించలేదు. నాటి వైసీపీ పెద్దల ఒత్తిళ్లతో కారణంలేవీ చూపకుండానే పీకేఎం ఉడా అధికారులు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేశారు. చివరకు అనుమతులు నిరాకరించారు. తాను ఏర్పాటు చేసిన సంస్థ అన్యాయంగా అనుమతులు నిరాకరించడంతో చంద్రబాబు ఆగ్రహానికి లోనయ్యారు. చివరకు కోర్టులో కేసు వేయడంతో 2023లో కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబుకు వద్దకు వచ్చి మరీ ఆయన సంతకం తీసుకుని పీకేఎం ఉడా అధికారులు ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు.

# రాష్ట్రపతి, గవర్నర్‌కు గడువు ఎలా విధిస్తారు?

**ఆ అధికారం మీకు ఉందా - సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నలు**



న్యూఢిల్లీ: శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవి కూడా తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు ఇటీవల సంచలన ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తాజాగా స్పందించినట్లు తెలుస్తోంది. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ.. రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదో ఒకటి చేయాలని ఆదేశాలు జారీ చేసిందిజ బిల్లులు ఆమోదించకపోతే దానికి గల కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి పలు ప్రశ్నలు సంధిస్తూ, ఈ ప్రశ్నలపై సర్వోన్నత న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం.

**రాష్టపతి అడిగిన ప్రశ్నలు ఇవే..**

*రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?*

*సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్రాలు దుర్వినియోగం చేస్తున్నాయా?*

*రాష్ట్రపతి, గవర్నరర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి?*

*రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలు ఏమిటి?*

*ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా?*

*ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా?*

*కాగా ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.*

# పాక్ అణ్వాయుధాలను స్వాధీనం చేసుకోవాలి

**- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్**



శ్రీనగర్: మూర్ఖదేశం పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలను తక్షణం స్వాధీనం చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిమాండ్ చేశారు. ఆ దేశం వద్ద అణ్వాయుధాల భద్రతపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన తర్వాత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మొదటిసారి గురువారం జమ్మూకశ్మీర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఆర్మీకి సంబంధించిన 15 కాప్స్ హెడ్ క్వార్టర్స్‌కు కూడా ఆయన వెళ్లారు. అక్కడ ఆర్మీ జవాన్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంపై కేంద్రమంత్రి మాట్లాడారు. బాధ్యత లేని.. మూర్ఖమైన పాకిస్థాన్ లాంటి దేశం దగ్గర అణుబాంబులు ఉండటం మంచిది కాదని ఆయన అన్నారు. పాక్ దగ్గర ఉన్న అన్ని అణుబాంబులను ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదానికి.. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన జవాన్లకు శిరస్సు వంచి వందనం చేస్తున్నానన్నారు. గాయపడ్డ జవాన్లకు సెల్యూట్ చేస్తున్నా. వారు త్వరగా కోలుకోవాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమయాకమైన పౌరులకూ నివాళులు అర్పిస్తున్నా. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేసిన అతి పెద్ద ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఎంతవరకైనా వెళ్తాం. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడాన్ని పాకిస్థాన్ ఇకనైనా ఆపాలి. ఉగ్రవాదులే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ దాడులు చేసిందని ప్రపంచం మొత్తానికి తెలుసు. ఈ రోజుకూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగానే పోరాటం చేస్తున్నాం. అణు బాంబు బెదిరింపులకు సైతం భయపడలేదు. పాకిస్థాన్ ఎంత చెత్తగా ఇండియాను బెదిరించిందో ప్రపంచం మొత్తం చూసింది. శ్రీనగర్ గడ్డమీద నుంచి ఓ ప్రశ్న లేవనెత్తుతున్నా. బాధ్యత లేని.. మూర్ఖమైన దేశం చేతిలో అణుబాంబులు ఉండటం ఎంత వరకు మంచిది. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ఆ బాంబులను స్వాధీనం చేసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ డిమాండ్ చేశారు.

# కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

**- ముష్కరుల గుట్టు బయటపెట్టిన డ్రోన్ కెమెరా**




శ్రీనగర్: జమ్మూకశ్మీర్లో భద్రతా దళాల ఉగ్రవేట జోరందుకుంది. అవంతిపొరాలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తాజా ఎన్‌కౌంటర్‌కు ముందు డ్రోన్ ద్వారా చిత్రీకరించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఓ షెడ్‌లోని కాంక్రీట్ పిల్లర్ వెనుక దాక్కున్న తీవ్రవాది కనబడుతున్నాడు. అతడి చేతిలో రైఫిల్ ఉంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న అవంతిపొరాలోని ఓ ఇంట్లో దాక్కున్న ముగ్గురినీ గురువారం ఉదయం సైన్యం, జమ్ము, కశ్మీర్ పోలీస్ జాయింట్ ఆపరేషన్ ద్వారా హతమార్చారు.

ట్రాల్ ప్రాంతంలోని నదిర్ గ్రామంలో ఉగ్రవాదులు నక్కినట్లు దళాలకు సమాచారం అందింది. దీంతో గురువారం ఆ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టింది. దీంతో హఠాత్తుగా ఉగ్రవాదులు కాల్పులు మొదలు పెట్టడంతో ఎన్ కౌంటర్ మొదలైంది. కొన్ని గంటలపాటు హోరాహోరీగా కాల్పులు జరిగాయి. ఎట్టకేలకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు హతమార్చాయి. వీరిని ఆసిఫ్ అహ్మద్ షేక్, అమిర్ నజీర్ వని, యావర్ అహ్మద్ భట్గా గుర్తించారు. వీరంతా జమ్మూకశ్మీర్లోని పుల్వామా ప్రాంతానికి చెందిన వారే.

ఈ ఎన్‌కౌంటర్‌లో డ్రోన్ చిత్రీకరించిన దృశ్యాలు ఇప్పుడు ఇంటర్నెట్లో వైరల్ గా మారాయి. జైషే మొహమ్మద్ సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను దళాలు చుట్టు ముట్టాయి. వారిలో ఒక ఉగ్రవాది నిర్మాణంలో ఉన్న కట్టడంలోని బేస్మెంట్‌కు వెళ్లి దాక్కొన్నాడు. దీంతో అతడి ఆచూకీ కనుగొనేందుకు భద్రతా దళాలు డ్రోన్ కెమెరాను రంగంలోకి దించాయి. ఉగ్రవాది ఓ పిల్లర్ చాటున నక్కినట్లు దీనిలో స్పష్టంగా కనిపించింది. అనంతరం దళాలు అతడిని మట్టుబెట్టాయి.

గత 48 గంటల్లో జరిగిన రెండో ఎన్ కౌంటర్ ఇది. బుధవారం దక్షిణ కశ్మీర్లోని షోపియన్ జిల్లాలో జరిగిన ఆపరేషన్లో ఇద్దరు టాప్ లష్కరే ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. వీరిని షహీద్ కుట్టా, అద్నాన్ షఫిగా గుర్తించాయి. షహిద్ 2023లో లష్కరేలో చేరాడు. గతేడాది ఏప్రిల్ ఓ రిసార్ట్ వద్ద కాల్పుల ఘటనకు ఇతడే బాధ్యుడు. ఈ ఘటనలో ఇద్దరు జర్మనీ పర్యటకులు, వారి డ్రైవర్ గాయపడ్డారు. ఓ సర్పంచి హత్య కేసులో కూడా ప్రధాన నిందితుడు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత షహిద్ ఇంటిని భద్రతా దళాలు పేల్చేశాయి.

# కశ్మీర్‌పై మూడో దేశం జోక్యం అవసరం లేదు

**- విదేశాంగ మంత్రి జై శంకర్**



న్యూఢిల్లీ: కశ్మీర్ సమస్యపై మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్–పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా, ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ దీనిని పట్టించుకోకుండా దుస్సాహసానికి ఒడిగట్టింద న్నారు. ఆ దాడికి మన సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని శాటిలైట్ చిత్రాలు స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత టీఆర్ఎఫ్ (ది రెసిస్టెన్స్ ఫ్రంట్) ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. పహల్గామ్ దాడిలో దోషులకు కఠిన శిక్ష విధించాలని ఐక్యరాజ్య సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్‌కు అంతర్జాతీయ మద్దతు లభిస్తోందని జై శంకర్ తెలిపారు.

# ముందు క్షమాపణలు చెప్పండి

**- మధ్యప్రదేశ్ మంత్రిపై సుప్రీం ఆగ్రహం**





న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడించిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన శాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం క్షమాపణలు చెప్పాలని ఆయన ను ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను మధ్యప్రదేవ్ హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదిం చాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టు ఆదేశాలపై అత్యున్నత న్యాయస్థానాన్ని మంత్రి ఆశ్రయించారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగా కుండా ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ముందు వెళ్లి హైకోర్టులో క్షమా పణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండని ఆగ్రహం వ్యక్తంచేసింది. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు.

అటు జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నాయకుడు ముక్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను మూర్ఖుడుగా ఆయన అభివర్ణించారు.

## ఖాన్ యూనిస్‌పై

# ఇజ్రాయెల్ వైమానిక దాడి..

### - 54మంది మృతి



ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. గాజాపై వరుస దాడులతో టెల్‌అవీవ్ విరుచుకుపడుతోంది. తాజాగా దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్‌పై అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. దాడుల్లో 54 మందికి పైగా మృతి చెందారు. అక్కడి ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాన్‌యూనిస్ నగరంపై టెల్‌అవీవ్ దాదాపు 10 విమానాలతో దాడులు చేసింది. భీకర దాడుల్లో 54మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఖతారీ టెలివిజన్ నెట్‌వర్క్‌కు చెందిన జర్నలిస్టు, అతడి కుటుంబంలోని 11మంది కూడా ఉన్నారు. బుధవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 70 మందివరకు మృతి చెందారు. ఇటీవల అగ్రరాజ్యం మధ్యవర్తిత్వంతో ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో హమాస్ ఇజ్రాయెల్లో ఉన్న అమెరికాకు చెందిన ఓ బందీని విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యప్రాచ్యంలో పర్యటనలో ఉండగా.. ఇజ్రాయెల్ ఈ దాడులు చేయడం గమనార్హం. గాజాతో యుద్ధంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇటీవల మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో తమ యుద్ధాన్ని ఆపడానికి ఎటువంటి మార్గం లేదని స్పష్టంచేశారు. దీంతో యుద్ధ విరమణ ఆశలు సన్నగిల్లాయి. హూతీలు తమపై దాడులు జరపడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హూతీలను కచ్చితంగా ఎదురుదెబ్బ తీస్తామన్న ఆయన గతంలో ఐడీఎఫ్ చేసిన దాడులను గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈసారి దాడులు మామూలుగా ఉండవని.. బాంబుల మోతలతో హోరెత్తుతాయని హెచ్చరించారు.

# టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాలి

### - ఐరాసలో భారత్ ప్రయత్నాలు




పహల్గాం ఉగ్రదాడితో దేశం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ మారణహోమానికి తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించుకున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో దానిని ఉగ్రసంస్థగా ప్రకటించేలా ఐరాసలో భారత్ కీలక చర్యలు ప్రారంభించింది. ఐరాస ప్రకటించిన అంతర్జాతీయ ఉగ్రసంస్థల జాబితాలో చేర్చేలా ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్న భారత ప్రతినిధుల బృందం.. ఆంక్షల పర్యవేక్షణ బృందం, యూఎన్‌లోని ఇతర భాగస్వామ్య దేశాలతో చర్చలు జరిపింది. అలాగే యూఎన్ ఆఫీస్ ఆఫ్ కౌంటర్ టెర్రరిజం, కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్‌తో భేటీ అయింది. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనేది పాకిస్థాన్‌కు చెందిన లష్కర్ ఏ తోయిబాకు అనుబంధ సంస్థ. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉద్భవించిన కొత్త ఉగ్రవాద సంస్థ ఇది. 2019 అక్టోబర్‌లో ఏర్పాటైన సంస్థకు ఉగ్రవాది షేక్ సాజిద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా బాసిత్ అహ్మద్ దార్ వ్యవహరిస్తున్నారు. హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే సభ్యులతో తొలుత టీఆర్ఎఫ్ ఏర్పడింది.

జమ్మూకశ్మీర్‌లో లష్కరే ఉగ్రముఠాకు అనుబంధంగా ఉన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను కేంద్ర హోంశాఖ గతంలోనే ఉగ్రసంస్థగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి జనవరి 6, 2023న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉగ్ర కార్యకలాపాల కోసం ఆన్‌లైన్ ద్వారా యువతను నియమించుకుంటోందని.. ఆయుధ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణావంటి చర్యలకు పాల్పడుతోందని తెలిపింది. జమ్మూ–కశ్మీర్ ప్రజలను భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదంలో చేరేలా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభావితం చేస్తోందని, ప్రజలు, భద్రతా దళ సభ్యుల హత్యలకు కుట్రలు పన్నుతోందని పేర్కొంది.

# అమెరికాలో ప్రమాదం

### భారత సంతతి ఇంజనీర్ సహా ముగ్గురి మృతి



అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వాషింగ్టన్ రాష్ట్రంలోని నార్త్ క్యాస్కేడ్స్ పర్వతారోహణకు వెళ్లిన ఓ బృందం ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన మరో యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. సియాటెల్‌లోని ప్రముఖ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న సియాటెల్‌కు చెందిన విష్ణు (48).. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్వతారోహణ కోసం నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి వెళ్లారు. దిగే సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురయ్యింది. ఈ క్రమంలో వారి యాంకర్ పాయింట్ అదుపుతప్పి 200 అడుగుల లోతులో పడిపోయారు. అందులో ప్రాణాలతో ఉన్న ఓ యువకుడు మాత్రం 64కి.మీ మేర నడిచి.. ఎట్టకేలకు సురక్షిత ప్రాంతానికి చేరుకొన్నాడు. ప్రమాద విషయాన్ని అధికారులకు వెల్లడించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. హెలికాప్టర్ సాయంతో మృతదేహాలను బయటకు తీసుకువచ్చినట్లు సమాచారం. భారత్‌కు చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సియాటెల్లో స్థిరపడ్డారు. గ్రేటర్ సియాటెల్‌లో ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ పేరుగాంచిన నిపుణుల్లో ఒకడిగా గుర్తింపు పొందడంతోపాటు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు.

# అమెరికా డబ్బుతో గాజాలో పిల్లలను చంపుతున్నారు

### - సెనెట్‌లో వ్యాపారవేత్త ఆందోళన



ఇజ్రాయెల్– హమాస్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గాజాలో అనేకమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్న సంగతి తెలిసిందే. దీనిపై బెన్ –జెర్రీ ఐస్క్రీమ్ సహ వ్యవస్థాపకుడు బెన్ కోహెన్ అమెరికా సెనెట్లో గళం విప్పారు. యూఎస్ ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ సెనెట్లో ప్రసంగిస్తుండగా కోహెన్ అడ్డు తగిలారు. ఈక్రమంలోనే ఆయనను పోలీసులు పక్కకు లాక్కెళ్లారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. గాజాతో జరుగుతున్న యుద్ధానికి ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని కోహెన్ ఖండిస్తూ గట్టిగట్టిగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయన చేతులకు సంకెళ్లు వేసి అక్కడినుంచి తీసుకెళ్లారు. ఈక్రమంలోనే గాజాలో పిల్లలను చంపడానికి కాంగ్రెస్ బాంబులకు డబ్బులు చెల్లిస్తుందంటూ ఆయన విలేకరులతో వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన తనను లాక్కెళ్తున్న వీడియోను ఎక్స్‌లో పంచుకున్నారు. దీనికి 'గాజాలో బాంబులు కొని పేద పిల్లలను చంపుతున్నారని కాంగ్రెస్‌కు చెప్పాను. అమెరికాలోని పేద పిల్లలకు అందించే మెడికేడ్‌లో కోతలు విధించడం ద్వారా దానికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని తెలిపాను. దీనికి అధికారుల ప్రతిస్పందన ఇది' అని ఆయన ఆ పోస్టుకి రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆకలితో అలమటిస్తున్న అక్కడి పిల్లలకు ఆహారం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకురావాలని సెనేటర్లను కోరినట్లు వెల్లడించారు. మెడికేడ్ అనేది అమెరికాలోని తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు అక్కడి ప్రభుత్వం అందించే ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం. అయితే, దీనికి అందించే నిధుల్లో వంద బిలియన్ డాలర్లు కోత విధించాలని ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు డెమోక్రట్లతో పాటు అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

### భారతీయ విద్యార్థిని

# విడుదల చేయండి

### అమెరికా న్యాయస్థానం ఆదేశం



హమాస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలతో భారత విద్యార్థి బదరాఖాన్ సురి అమెరికాలో అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో సురికి అమెరికా న్యాయస్థానంలో ఊరట లభించింది. నిర్బంధంలో ఉన్న భారతీయ విద్యార్థిని తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చింది. టెక్సాస్ నుంచి వర్జీనియా వెళ్లేందుకు అనుమతించా లని డిస్ట్రిక్ట్ జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. న్యాయమూర్తి మాటలు విన్నప్పుడు తనకు కన్నీళ్లు వచ్చాయని సురి భార్య సంతోషం వ్యక్తంచేశారు. వాషింగ్టన్ డీసీలోని జార్జిటౌన్ యూని వర్సిటీలో పోస్ట్ డాక్టోరల్‌గా ఉన్న బదర్ ఖాన్ సురి.. విశ్వవిద్యాలయంలో హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడని డిపార్ట్మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఉగ్రవాద సంస్థలోని పలువురితో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు.

దీంతో అతడి వీసాను రద్దు చేయడమే గాక.. వర్జీనియాలోని నివాసం నుంచి అతడిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో తన అరెస్టును సవాల్ చేస్తూ సురి కోర్టును ఆశ్రయించారు. ఇది పూర్తిగా రాజకీయ కుట్రపూరిత చర్యేనని తన పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన ఈస్టన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ వర్జీనియా కోర్టు.. అతడికి ఇటీవల తాత్కాలిక ఉపశమనం కల్పించింది. ఈ వ్యవహారంపై న్యాయస్థానం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు అతడిని అమెరికా నుంచి పంపించకూడదని స్పష్టంచేసింది. అప్పటినుంచి అతడిని లూసియానాలోని ఇమిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్లో ఉంచినట్లు అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వెల్లడించింది. ఇప్పుడు అక్కడినుంచి విడుదల చేస్తూ కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది.

### పీవోకే ఉగ్ర శిబిరాలను

# నేలమట్టం చేయాలి: బాబ్



పహల్గాంలో పర్యాటకులపై జరిగిన పాశవిక ఉగ్రదాడిని బ్రిటిష్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ తీవ్రంగా ఖండించారు. భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను కొనియాడిన ఆయన పీవోకేలోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేయాలని వ్యాఖ్యానించారు. ఈమేరకు యూకేలోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాట్లాడిన వీడియోను బాబ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్లోని 9 ఉగ్రస్థావరాలపై కచ్చితమైన వైమానిక దాడులు చేసింది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయి.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను పూర్తిగా నేలమట్టం చేయాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని అధికార ప్రభుత్వాన్ని బాబ్ కోరారు. దీనికి యూకే విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ స్పందించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి భయంకరమైనదని లామీ అభివర్ణించారు. ఉగ్రవాదంపై పోరుకు తమ ప్రభుత్వం భారత్, పాక్‌లతో కలసి పనిచేస్తోందన్నారు.

శాశ్వత శాంతి నెలకొనేందుకు ఇరుదేశాల మద్దతు అవసరమన్నారు. ఇక, పహల్గాం ఉగ్రదాడిని బాబ్ గతంలోనూ ఖండించారు. ఆ సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకునే ఎలాంటి చర్యలకైనా తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రైజ్ మనీ.. భారీగా పెంచిన ఐసీసీ!




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కీలక ప్రకటన చేసింది. 2023-25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఐసీసీ ప్రైజ్ మనీని పెంచింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ విజేతకు ఇప్పుడు రికార్డు స్థాయిలో ప్రైజ్ మనీ లభిస్తుంది. ఈ సారి ప్రైజ్‌మనీ గత సారి కంటే రెట్టింపు కంటే ఎక్కువ. డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయంతో క్రికెట్ ప్రపంచంలో ఆనందం వెల్లివిరుస్తోంది.

**డబ్ల్యూటీసీ ప్రైజ్ మనీని రెట్టింపు చేసిన ఐసీసీ**

2023-25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కోసం మొత్తం ప్రైజ్ మనీ 5.76 మిలియన్ అమెరికన్ డాలర్లు(సుమారు రూ.49.27కోట్లు) అని ఐసీసీ వెల్లడించింది. ఇది గత రెండు సార్లు కంటే చాలా ఎక్కువ. ఛాంపియన్ జట్టుకు 3.6 మిలియన్ అమెరికన్ డాలర్లు అందుతాయని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది 2021-23 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇచ్చిన 1.6 మిలియన్ అమెరికన్ డాలర్ల కంటే చాలా ఎక్కువ. రన్నరప్ జట్టు 2.16 మిలియన్ డాలర్లను అందుకుంటుంది. ఇది గతంలో ఇచ్చిన 8 లక్షల డాలర్ల కంటే చాలా ఎక్కువ.

**ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఎదుర్కోనున్న దక్షిణాఫ్రికా**

2025 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ రేసులో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో నిలిచింది. ఫైనల్‌కు చేరుకున్న మొదటి జట్టుగా నిలిచింది. వారు పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లపై సిరీస్‌లను గెలుచుకున్నారు. దీనితో పాటు భారత్‌తో జరిగిన సిరీస్ డ్రా అయింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్‌ను 3-1 తేడాతో ఓడించి ఆస్ట్రేలియా అర్హత సాధించింది. ఈ సారి భారత్ మూడో స్థానంలో నిలిచింది. రెండు సార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు 1.44 మిలియన్ అమెరికన్ డాలర్లు(సుమారు రూ.12.31కోట్లు) అందుకుంటుంది. ప్రైజ్ మనీ పొందుతున్న జట్లలో భారత్ మూడో స్థానంలో ఉంది.

**ప్రకటించిన ఐసీసీ ఛైర్మన్ జైషా**

ఈ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జైషా మాట్లాడుతూ.. "ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో చాలా ఆసక్తికరమైన మూడో రౌండ్‌ను చూశామని.. ఫైనల్స్‌కు చేరే జట్లను చివరి వరకు నిర్ణయించలేకపోయారన్నారు. ఈ ఛాంపియన్ షిప్‌లో వివిధ జట్ల ఆటగాళ్లు అద్భుతంగా రాణించారన్నారు. ఫలితంగా రెండు అత్యుత్తమ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. లార్డ్స్‌లో జరిగే ఈ వేడుకను ప్రేక్షకులు, ప్రపంచవ్యాప్తంగా చూస్తున్న అభిమానులు గొప్ప క్రికెట్‌ను ఆస్వాదిస్తారని తాను అనుకుంటున్నానన్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఒక నెలలోపు మైదానంలోకి దిగుతాయన్నారు.

# టెస్ట్ కెప్టెన్ రేసులోకి మరో పేరు!



రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు ముందంజలో ఉన్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని, కెప్టెన్సీ బాధ్యతను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించవచ్చని భావిస్తున్నారు. అయితే భారత మాజీ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ కోసం ఒక ఆటగాడి పేరును సూచించాడు. అశ్విన్ సూచించిన ఆటగాడి పేరు కూడా ఎప్పుడూ చర్చల్లోకి రాలేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్ అయిన తర్వాత జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడిని జట్టుకు కెప్టెన్‌గా చేయాలని అశ్విన్ సూచించాడు.

కొత్త కెప్టెన్ పేరును సూచించిన అశ్విన్

రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో మాట్లాడుతూ .. టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి మాట్లాడారు. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌పై ఇప్పుడు అంత ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదని అశ్విన్ అన్నాడు. రవీంద్ర జడేజాను రెండేళ్ల పాటు కెప్టెన్‌గా చేయవచ్చని ఆయన అన్నారు. "జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు రవీంద్ర జడేజా. మీరు కొత్త ఆటగాడికి శిక్షణ ఇవ్వాలనుకుంటే జడేజాను రెండేళ్లపాటు కెప్టెన్‌గా చేయండి. జడేజా రెండేళ్ల పాటు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. శుభ్‌మన్ గిల్‌ను రవీంద్ర జడేజాకు డిప్యూటీ అంటే వైస్ కెప్టెన్‌గా చేయవచ్చు" అని అశ్విన్ అన్నాడు.

భారత జట్టుకు కెప్టెన్ కావడం ప్రతి ఆటగాడి కల అని అశ్విన్ అన్నాడు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా కూడా ఈ పాత్రను సంతోషంగా అంగీకరిస్తాడని చెప్పుకొచ్చాడు. జడేజాను కెప్టెన్‌గా చేయమని తాను బలవంతం చేయడం లేదని.. కానీ జడేజాకు కెప్టెన్సీని అప్పగించడంలో ఎటువంటి హాని లేదని అశ్విన్ పేర్కొన్నాడు.

ఐపీఎల్‌లో కెప్టెన్‌గా ఉన్న రవీంద్ర జడేజా

రవీంద్ర జడేజా గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే రవీంద్ర జడేజా కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది. రవీంద్ర జడేజా సీజన్ మధ్యలో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు అనుభవానికి లోటు లేదు. రవీంద్ర జడేజా 2012లో టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అంటే జడేజా భారత్ తరఫున టెస్టుల్లో 13 సంవత్సరాల నుంచి ఆడుతున్నాడు. జడేజా తన బ్యాటింగ్, బౌలింగ్‌తో టీమిండియా అనేక మ్యాచ్‌లను గెలిపించడంలో సహాయపడ్డాడు.



# ప్లే ఆఫ్స్ మ్యాచ్లకు బట్లర్ దూరం..

## గుజరాత్ జట్టులోకి శ్రీలంక బ్యాటర్

గుజరాత్ టైటాన్స్ జోస్ బట్లర్ స్థానంలో శ్రీలంక ఆటగాడు కుశాల్ మెండిస్‌ను తీసుకుంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో బట్లర్ ప్లే ఆఫ్స మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌ల ఆడేందుకు బట్లర్ మే 26న స్వదేశానికి వెళ్లనున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ గుజరాత్ చివరి లీగ్ మ్యాచ్ ముగిసిన అనంతరం బట్లర్ గుజరాత్ జట్టును వీడతాడు. మెండిస్‌ను గుజరాత్ రూ.75 లక్షలకు తీసుకుంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు 16 పాయింట్లతో ఉన్న గుజరాత్ ప్లే ఆఫ్సకు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

మయాంక్‌కు మళ్లీ గాయం

గత ఐపీఎల్ సీజన్‌లో నిలకడగా 150 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్. గాయంతో కొన్ని నెలలుగా ఆటకు దూరంగా ఉన్న అతను ఈ ఐపీఎల్ సీజన్‌లోనూ ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు రెండే మ్యాచ్‌ల ఆడిన మయాంక్ మళ్లీ గాయపడ్డాడు. దీంతో ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్లకు దూరమయ్యాడు. మయాంక్ స్థానంలో న్యూజిలాండ్ పేసర్ విలియం ఓరూర్క్‌ను జట్టులోకి తీసుకున్నట్లు లక్నో ఫ్రాంఛైజీ వెల్లడించింది. ఓరూర్క్‌ను కనీస ధర రూ.3 కోట్లకు లఖ్నవూ జట్టులోకి తీసుకుంది.

పంజాబ్ జట్టులోకి కైల్ జేమీసన్

ఈ సీజన్ ఆరంభంలోనే గాయం కారణంగా పంజాబ్ ఆటగాడు ఫెర్గూసన్ టోర్నీకి దూరమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడికి రీ ప్లేస్‌మెంట్‌గా పంజాబ్ కొత్త ప్లేయర్‌ని తీసుకుంది. న్యూజిలాండ్‌కు చెందిన ఫాస్ట్ బౌలర్ కైల్ జేమీసన్ను రూ.2 కోట్లకు టీమ్‌లో చేర్చుకుంది.

# జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత మహిళల జట్టు

## ఐదు టీ20లు, 3 వన్డేలు.. జట్లను ప్రకటించిన బీసీసీఐ

శ్రీలంకలో జరిగిన వన్డే ముక్కోణపు సిరీస్ ను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు మరో పోరుకు సిద్ధమవుతోంది. టీమ్ ఇండియా జూన్లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి ఆతిథ్య జట్టుతో 3 వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. జూన్ 28 నుంచి టీ20 సిరీస్, జులై 16న వన్డే సిరీస్ మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ సెలక్షన్ కమిటీ జట్లను ప్రకటించింది. షెఫాలీ వర్మ, స్నేహ్ రాణా చాలా రోజుల తర్వాత టీ20 జట్టులోకి వచ్చారు. పేస్ బౌలింగ్ ఆల్రౌండర్లు క్రాంతి గౌడ్, సయోలీ సత్పరే.. ఎడమచేతి వాటం స్పిన్నర్లు నల్లపురెడ్డి శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయలకు తొలిసారిగా టీ20లకు పిలుపొచ్చింది.

టీ20 జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, నల్లపురెడ్డి శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్, అమంజోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్పరే.

వన్డే జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్, అమన్ జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్. సయాలీ సతఘరే.



చైతన్య రథం
సినిమా
శుక్రవారం 16 మే 2025


# రాజ్‌తో రిలేషన్‌లో సాం?

## భార్య శ్యామాలీ ఏమన్నారంటే

'ది ఫ్యామిలీమ్యాన్ సీజన్ 2' దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత రిలేషన్‌లో ఉన్నారన్న ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. 'శుభం' సక్సెస్‌లో భాగంగా చిత్ర బృందం, దర్శకుడు రాజ్ నిడుమోరుతో కలిసి దిగిన ఫొటోలను బుధవారం సమంత ఇన్స్టాలో షేర్ చేస్తూ.. అద్భుతమైన ప్రయాణం మొదలైందని క్యాప్షన్ పెట్టారు ఈ ఫొటో వైరలైన తరుణంలో రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఇన్‌స్టా వేదికగా సందేశాత్మక పోస్ట్ పెట్టడం ఆసక్తికరంగా మారింది. "నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి, నా గురించి రాసే వారందరికీ ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా" అనే పోస్టును ఆమె షేర్ చేశారు. కొంతకాలంగా ఇన్‌స్టాలో సైలెంట్‌గావున్న ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అన్న చర్చ నడుస్తోంది. సైకాలజీ చదువుకున్న శ్యామాలి, బాలీవుడ్ దర్శకులు రాకేశ్ ఓంప్రకాశ్ మిశ్రా, విశాల్ భరద్వాజ్ వద్ద అసిస్టెంట్‌గా వర్క్ చేశారు. 'రంగ్దే బసంతి', 'ఓంకార' చిత్రాలకు క్రియేటివ్ కన్సల్టెంట్‌గా వర్క్ చేశారు. 2015లో రాజ్ నిడిమోరుతో ఆమె వివాహమైంది. వీరికి పాప ఉందని సమాచారం. పెళ్లి





తర్వాత రాజ్ రూపొందించిన చిత్రాలకు ఆమె క్యాస్టింగ్‌లో సాయం చేస్తుండేవారు. ఇదే విషయాన్ని ఆయన గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. రాజ్ శ్యామాలి విడిపోతున్నారంటూ కొన్ని రోజుల క్రితం వార్తలు వచ్చాయి. రాజ్– డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీమ్యాన్ సీజన్ 2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించిన సంగతి తెలిసిందే. ఆయా ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్న సమయంలోనే రాజ్‌తో సమంతకు పరిచయం బలపడింది.

## బ్లో అప్




# ఫాల్కే పాత్రలో ఎన్టీఆర్..

వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు స్టార్ హీరో ఎన్టీఆర్. ఇప్పుడీ హీరోకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటివరకూ ఎప్పుడూ చేయని పాత్రలో నటించనున్నట్టు తెలుస్తోంది. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం దర్శక ధీరుడు రాజమౌళి సమర్పణలో 'మేడ్ ఇన్ ఇండియా' అనే బహు భాషా చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని ఆయన తనయుడు కార్తికేయ, వరుణ్ గుప్తా సంయుక్తంగా నిర్మిస్తున్నట్టు చెప్పారు. నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తారని వెల్లడించారు. ఇప్పుడీ ప్రాజెక్ట్ ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. భారతీయ సినిమా గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారట. ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా దాదాసాహెబ్ ఫాల్కే జీవితం ఆధారంగా దీన్ని రూపొందించనున్నట్టు సమాచారం. అందులో ఎన్టీఆర్ నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు కూడా బాలీవుడ్ మీడియా పేర్కొంది. "స్క్రిప్ట్ విని ఆశ్చర్యపోయారు. ఈ కథ భారతీయ సినిమా పుట్టుక.. అది ఎదిగిన తీరును ప్రపంచానికి చూపనుంది. ఈ పాత్రలో నటించడానికి ఎన్టీఆర్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. టీమ్ మొత్తం దీనిపై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. దీనిపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఫైనల్ స్క్రిప్ట్ కూడా లాక్ అయింది" అని సినీవర్గాల సమాచారం. ఇదే నిజమైతే ఎన్టీఆర్ మరో క్రేజీ ప్రాజెక్టులో కనిపిస్తారని ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం ఈ హీరో లైనప్‌లో నాలుగు సినిమాలు ఉన్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్'లో నటిస్తున్నారు. అలాగే 'వార్ 2'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. దీని తర్వాత 'దేవర 2' ఉంది. అలాగే తమిళ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు వీటి వరుసన దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ కూడా చేరింది.

# 17న థగ్ లైఫ్ ట్రైలర్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్'. భారీ తారాగణంతో పాన్ ఇండియా స్థాయిలో సినిమా సిద్ధమవుతోంది. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇటీవల జరగాల్సిన దీని ఆడియో విడుదల కార్యక్రమాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఆడియో లాంచ్ వివరాలను టీమ్ వెల్లడించింది. మే 17న ట్రైలర్ రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. మే 24న ఆడియో విడుదల భారీస్థాయిలో జరపనున్నట్టు వెల్లడించింది. ఈవెంట్‌లో ఏఆర్ రెహమాన్ ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నాడట. "ఇటీవల దేశం కోసం మేం మా వేడుకలను నిలిపివేశాం. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎంతో మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఇప్పుడు థగ్ లైఫ్ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభిస్తున్నాం" అని నోట్ విడుదల చేసింది. 'నాయకన్' (1987) లాంటి హిట్



తర్వాత కమల్– మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జూన్ 5న సినిమా విడుదల కానుంది.

# తప్పదంటే.. యుద్ధం తప్పదు

ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాల గురించి బాలీవుడ్ నటుడు అజయ్ దేవణ్ మాట్లాడారు. కశ్మీర్లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారత సాయుధ దళాలను అభినందించారు. బుధవారం ముంబయిలో జరిగిన 'కరాటే కిడ్: లెజెండ్స్' ట్రైలర్ లాంచ్ ఈవెంటుకు అజయ్ దేవణ్ తన కుమారుడితో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన తొలిసారి ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. "నేను ఇలా చెప్పాల్సిన అవసరం లేదు. ఎవరూ యుద్ధాన్ని కోరుకోరు. కానీ.. దీనికి వేరే మార్గం లేనప్పుడు యుద్ధమే ఏకైక మార్గం అవుతుంది. నేను సాయుధ దళాలకు, ప్రధానికి, ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తున్నాను. వారి పనిని వారు ధైర్యంగా, ప్రశంసనీయంగా చేశారు" అని అన్నారు. ఇక బాలీవుడ్ సెలబ్రిటీలు ఆపరేషన్ సిందూర్ గురించి పెదవి విప్పడం లేదంటూ ఇటీవల కొన్ని విమర్శలు ఎదురైన విషయం తెలిసిందే. వాటికి చెక్ పెట్టేందుకు తాజాగా కొందరు బీ టౌన్



ప్రముఖులు దీని గురించి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్‌లు సాయుధదళాలపై ప్రశంసలు కురిపిస్తూ ఇటీవల పోస్టు పెట్టారు.

# ఓటీటీకి హిట్-3

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించి మెప్పించిన లేటెస్ట్ చిత్రం "హిట్ 3". తెలుగు స్టేట్స్‌నుంచి యూఎస్ మార్కెట్ వరకు హిట్ 3 భారీ వసూళ్లు సాధించింది. ఇక ఈ సినిమా థియేటర్స్‌లో ఇప్పటికీ బాగానే కొనసాగుతుండగా ఫైనల్‌గా సినిమా ఓటీటీ రిలీజ్‌కి బజ్ వినిపిస్తుంది. దీని ప్రకారం జూన్ 5నుంచి సినిమా స్ట్రీమింగ్‌కి రానుందట. పాన్ ఇండియా ఓటిటి హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా శ్రీనిధిశెట్టి హీరోయిన్‌గా నటించింది. అలాగే అడివి శేష్, కార్తీలు సాలిడ్ క్యామియోస్‌లో నటించారు. అలాగే నానినే ఈ చిత్రానికి నిర్మాణం కూడా వహించిన సంగతి తెలిసిందే.



# జాలీ 'నవ్వుల' జింఖానా

ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటించిన కామెడీ ఎంటర్టైనర్ 'జాలీ ఓ జింఖానా'. జనవరిలో తమిళ ప్రేక్షకుల ముందుకువచ్చిన సినిమా నవ్వులు పూయించింది. ఇప్పుడీ చిత్రం తెలుగు ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమైంది. ఆహా వేదికగా అందుబాటులోకి వచ్చింది. శక్తి చిదంబరం దర్శకత్వం వహించిన సినిమా కోలీవుడ్‌లో థియేటర్‌లో విడుదలై ఆకట్టుకుంది. తెలుగులో మాత్రం డైరెక్ట్ ఓటీటీలో రిలీజైంది. ఇందులో ప్రేమమ్ నటి మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్‌గా నటించగా అభిరామి, యోగిబాబు, రెడిన్ కింగ్స్ కీలక పాత్రల్లో కనిపించారు. అనుకోని పరిస్థితుల్లో చనిపోయిన ఓ వ్యక్తిని బతికిఉన్నట్టు చూపించడం కోసం ఓ కుటుంబం ఏం చేసిందనే ఆసక్తికర కథాంశంతో దీన్ని రూపొందించారు.